తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
మంగళవారం
05 ఆగస్టు 2025
పేజీలు : 10
Follow :

## ఉమ్మడి పాలమూరు జిల్లాలో
# మరో కొత్త రైల్వే జోన్..!

◆ కృష్ణా- వికారాబాద్ లైనుతో గోవాకు తగ్గనున్న దూరం
◆ సీఎం రేవంత్‌రెడ్డి ఇలాకాలో సంబరాలు

**వనపర్తి, ఆగస్టు04 (జనంసాక్షి):** తెలంగాణలో రైల్వేల అభివృద్ధికి కేంద్రం చర్యలు చేపట్టింది. ఇప్పటికే అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రైల్వే స్టేషన్లు ఆధునీకరించి అందుబాటులోకి తీసుకొచ్చింది. మరి కొన్ని స్టేషన్లు కొత్తరూపు సంతరించుకుంటున్నాయి. అదే సమయంలో రైల్వే కనెక్టివిటీ పెంచేందుకు కొత్త మార్గాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. అందులో భాగంగా ఉమ్మడి మహబూబ్ నగర్ (పాలమూరు) జిల్లా వాసులకు రైల్వే శాఖ శుభ సమాచారం (గుడ్ న్యూస్) అందించింది. తాజాగా నారాయణ పేట జిల్లా కృష్ణా రైల్వేస్టేషన్ నుంచి వికారాబాద్ వరకు ప్రతిపాదిత కొత్త రైలు మార్గానికి సంబం ధించిన తుది సర్వే (ఫైనల్ లోకేషన్ సర్వే) విజయవంతంగా పూర్తయ్యింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఈ నెలాఖరుకల్లా డీపీఆర్ రైల్వేబోర్డుకు చేరే అవకాశం ఉందని రైల్వే వర్గాలు తెలిపాయి. ఈ మార్గం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ మీదుగా వెళ్లనుండటం గమనార్హం. కృష్ణా-వికారాబాద్ నూతన రైల్వే లైన్ కోసం చాలాకాలంగా డిమాండ్ ఉంది. రైల్వే కనెక్టివిటీలో వెనుకబడిన వికారాబాద్, నారాయణపేట జిల్లాల్లోని పలు ప్రాంతాలకు ఈ ప్రాజెక్టు ఎంతో కీలకమని ప్రజలు ఆశిస్తున్నారు. గత ఏడాది జనవరి 31న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ రైల్వే లైన్ విషయమై కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ కు లేఖ రాశారు. ఈ రైల్వే లైను నిర్మాణ వ్యయాన్ని 100 శాతం కేంద్ర ప్రభుత్వమే భరించాలని ఆయన లేఖలో కోరారు. తుది సర్వేలో భాగంగా ఆర్థిక, సాంకేతిక, పర్యావరణ, భూసంబంధిత అంశాలపై సమగ్ర విశ్లేషణ జరిగింది. రేట్ ఆఫ్ రిటర్న్ పెంపుకు కసరత్తుకృష్ణా-వికారాబాద్ లైనులో రేట్ ఆఫ్ రిటర్న్ (ఆర్ఓఆర్) ఐదారు శాతం వరకు వస్తుందని రైల్వే అధికారులు అం చనా వేసినట్లు సమాచారం. సాధారణంగా 10 శాతం ఆర్ఓఆర్ ఉంటేనే రైల్వేశాఖ సులభంగా ఆమోదిస్తుంది. అయితే, ప్రాథమిక సర్వేలోని అలైన్‌మెంట్‌లో స్వల్ప మార్పులు చేసినట్లు తెలుస్తోంది. కొడంగల్ నియోజకవర్గ కేంద్రానికి కొంత దూరంగా ఉన్న ప్రాథమిక అలైన్‌మెంట్‌ను, స్టేషన్‌ను అక్కడి ప్రజలకు చేరువలో ఉండేలా మార్చారు. ప్రతిపాదిత రైల్వేలైన్‌ను కృష్ణా-మక్తల్-నారాయణపేట-దామరగిద్ద-బాలంపేట-దౌల్తాబాద్-కొడంగల్-పరిగి-వికారాబాద్ వరకు నిర్మించనున్నారు. మొత్తం 121.70 కిలోమీటర్లు కాగా,అంచనా వ్యయం సుమారు రూ. 2 వేల కోట్లు. ఈ ప్రతిపాదిత రైలు మార్గం కార్యరూపం దాల్చి, నిర్మాణం పూర్తయితే అనేక ప్రయోజనాలు చేకూరనున్నాయి.

**గోవాలోని మడ్‌గావ్‌కు తగ్గనున్న..**

ప్రస్తుతం హైదరాబాద్ నుంచి గోవాలోని మడ్‌గావ్ *మిగతా 2లో..*




## విద్యార్థులకు క్రమ శిక్షణతో కూడిన విద్య అందించాలి : కలెక్టర్



**నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి):** విద్యార్థినీలకు క్రమశిక్షణతో కూడిన విద్యను నేర్పించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. సోమవారం ధన్వాడ మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల వివరాలు, పాఠశాల వివరాలు, స్టాఫ్ వివరాలు, మధ్యాహ్న భోజనం వివరాలను తదితర రిజిస్టర్లతో జిల్లా కలెక్టర్ కార్యాలయానికి తీసుకోని రావాలని ఎస్.ఓ. గంగమ్మను ఆదేశించారు. విద్యార్థి నిలు 85% మాత్రమే ఎఫ్ఆర్ఎస్‌లో నమోదయినందుకు ప్రత్యేక అధికారికి తగు సూచనలు ఇచ్చారు. ప్రతిరోజు ఉపాధ్యాయులు సమయ పాలన పాటించి 100 శాతం నమోదు చేసుకుంటూ విద్యార్థులను కూడా 100 శాతం నమోదు చేయాలని సూచనలు ఇచ్చారు. అనంతరం ధన్వాడలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి స్టాఫ్ వివరాలు ప్రతిరోజు ఓపి ఎంత వస్తుందో అడిగి తెలుసుకున్నారు.

ఎన్ని సబ్ సెంటర్లు ఉన్నాయని అడగగా ఐదు ఉన్నాయని ఆసుపత్రి వైద్యులు తెలి పారు. పీహెచ్ నర్సుకి మెమో జారీ చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఏఎంసి, పీఎం ఎస్ఎంఎ రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అయిదు క్యాం పులను నిర్వహించినట్లు వైద్యులు తెలిపారు. అనంతరం వ్యాక్సిన్ రూమ్ లేబర్ రూమ్, హెూమియో డిస్పెన్సరీ తనిఖీ చేశారు. ఆస్పత్రి ఆవరణలో వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించాలని ఎంపీడీ వోని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డి.ఈ.ఓ. గోవింద్ రాజ్, మండల్ ఎద్యు కేషన్ అధికారి, తాసి ల్దార్ సింధుజ ఎంపీడీవో వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 43 ఫిర్యాదులు



**గద్వాల నడిగడ్డ,ఆగస్టు 4(జనం సాక్షి)** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 43 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావులకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం వెనుకబడిన జిల్లాల అభివృద్ధి కోసం నీతి ఆయోగ్ ద్వారా చేపట్టిన సంపూర్ణత అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆరు కీలక సూచికలలో విశేష కృషి చేసిన జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్‌ని శనివారం గవర్నర్ విష్ణు దేవ్ వర్మ ద్వారా రాజ్ భవన్‌లో అవార్డు పొందిన సందర్భంగా జిల్లా అధికారులు కలెక్టర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌కి గువ్వల బాలరాజు రాజీనామా



**అచ్చంపేట ఆగస్టు 4 (జనం సాక్షి) :** బిఆర్ఎస్ పార్టీ కీలక నేత అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు రాజీనామా చేశారు. సోమవారం ఆయన రాజీనామా లేఖను పార్టీ అధినేత కేసిఆర్‌కు అందజేశారు. కారణాలు తెలియవలసి ఉంది. ఇదిలా ఉండగా స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తుండడంతో బిఆర్ఎస్ పార్టీకి వరస షాక్‌లు తగులుతున్నారు. పార్టీలో కీలక నేతగా ఉంటున్న గువ్వల బాలరాజు రాజీనామాతో ఆ పార్టీ శ్రేణులు గందరగోళానికి గురవుతున్నారు.

## లాటరీ పద్ధతి ద్వారా లబ్ధిదారులకు ఇండ్లు ఇవ్వాలి

### మాజీ ఎమ్మెల్యే ఎం. భూపాల్ రెడ్డి




**నారాయణఖేడ్ ఆగస్టు 4 (జనం సాక్షి)** అర్హులైన అందరికీ డబల్ బెడ్ రూమ్ ఇండ్లను వెంటనే ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే మహా రెడ్డి భూపాల్ రెడ్డి అన్నారు. సోమ వారం ఆయన మాట్లాడుతూ నేను ఎమ్మెల్యే గా ఉన్నప్పుడు లాటరీ సిస్టం ద్వారా ఎంపిక చేసిన లబ్ధిదారులకు వెంటనే డబల్ బెడ్ రూమ్ ఇండ్లను పంపిణీ చేయాలని పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా వచ్చి సబ్ కలెక్టర్ కు వినతి పత్రం అందించారు. మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు లాటరీ సిస్టం ద్వారా అర్హులైన నిరుపేదలకు ఇండ్లు కేటాయించామని వారికి వెంటనే వాటిని పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వారి కోసం బిఆర్ఎస్ పార్టీ ఎటువంటి పోరాటానికైనా సిద్ధమేనని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులు, నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## రాష్ట్రస్థాయిలో బంగారు పతకంతో మెరిసిన విద్యార్థులు



**మక్తల్, ఆగస్టు 04 (జనంసాక్షి) :** వరంగల్ జిల్లా హనుమకొండలో జరుగుతున్న 11వ సౌత్ జోన్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ పోటీలో మక్తల్ ఈనాడు లక్ష్య సెంటర్ క్రీడాకారుడు బసంత్ 600 మీటర్ల పరుగు పందెంలో 1. 25 సెకండ్స్‌లో పరిగెత్తి బంగారు పతకం సాధించాడు. త్రిబుల్ జంప్ మెన్ విభాగంలో జనార్ధన్ బ్రాంజ్ మెడల్ అలాగే, హైజంప్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించినట్లు కోచ్ జగదీష్ తెలియజేశారు. ఈ పథకాలు సాధించిన క్రీడాకారులకు తెలంగాణ క్రీడా శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అభినందనలు తెలియజేశారు. పథకాలు సాధించిన విద్యార్థులు త్వరలో జరిగే సౌజన్ నేషనల్ ఛాంపియన్షిప్ పోటీలో పాల్గొంటారని కోచ్ జగదీష్ తెలిపారు.

## విజయవంతమైన ఉచిత కంటి వైద్య శిబిరం



**మక్తల్, ఆగస్టు 04 (జనంసాక్షి)**
లయన్స్ క్లబ్ ఆఫ్ మక్తల్ బీమా ఆధ్వర్యంలో పాలమూరు రాంరెడ్డి కంటి ఆసుపత్రి సౌజన్యంతో ప్రోగ్రాం చైర్మన్ అనుగొండ శ్రీనివాసులు సహకారంతో సోమవారం చేపట్టిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైనట్లు అధ్యక్షుడు సత్య ఆంజనేయులు తెలిపారు. కంటి వైద్య శిబిరంలో భాగంగా దాదాపు 100 మంది వరకు కంటి పరీక్షలు నిర్వహించి సుమారు 30 మందిని కంటి శస్త్ర చికిత్సల కోసం పాలమూరు తరలించామని అన్నారు. లైన్స్ క్లబ్ మక్తల్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో సెక్రటరీ అంజన్ ప్రసాద్, కోశాధికారి ఆడం సత్యనారాయణ, డాక్టర్ మణికంఠ గౌడ్, అంబాదాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే నిధులతో బోరు డ్రిల్లింగ్

**రాజాపూర్, ఆగస్టు 04, (జనంసాక్షి) :** రాజాపూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రోడ్డులో గల వాల్మీకి భవనం వద్ద ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి నిధులతో సోమవారం బోరు డ్రిల్లింగ్ చేశారు. బోరులో పుష్కలంగా నీరు రావడంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రోడ్డులో గల కాలనీ వాసులు తమకు నీటి వసతి కల్పించిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఏఎంసీ వైస్ చైర్మన్ శేఖర్ గౌడ్, జనంపల్లి శశికళా రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ వనపర్తి రమణ, నాయకులు గోవర్ధన్ రెడ్డి, వనపర్తి నరహరి, గోనెల రమేష్, శ్యాంసుందర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, విక్రమ్ రెడ్డి, ఇస్తారయ్య, నర్సింహ, ప్రశాంత్, జనార్ధన్, రాము, పంచాయతీ కార్యదర్శి జైపాల్ తదితరులు పాల్గొన్నారు.



## పారిశ్రామిక రంగంలో

# మహిళలు రాణించాలి



### జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

**నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి):** మహిళలు వ్యాపార రంగంలో రాణించి పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని నారాయణ పేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. వీ హబ్ ఆధ్వ ర్యంలో జిల్లాలోని స్వయం సహాయక సంఘాల మహి ళలు, మహిళా పారిశ్రామిక వేత్తలకు ర్యాంప్ (రైసింగ్ అండ్ యాక్సిలరేటింగ్ ఎంఎస్ఎంఈ పెర్ఫార్మెన్స్ స్కీమ్) ప్రోగ్రాంపై జిల్లా కేంద్రానికి సమీపం లోని సింగారం మలుపు వద్ద గల వృత్తి నైపుణ్య అభివృద్ధి కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ముఖ్య అతిథిగాహాజరై మహిళా పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి మాట్లాడారు. వరల్డ్ బ్యాంక్, కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ ఎంఎస్ఎంఈ ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ ప్రోగ్రాం ద్వారా మహిళల ఆధ్వర్యంలో నడుస్తున్న వ్యాపారాలు /ఎంఎస్ఎంఈలకు బిజినెస్ యక్షలరేషన్ సపోర్ట్ అంద నుంద రెండు సంవత్సరాల పాటు కొనసాగనున్న ఈ ప్రోగ్రాంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎంపికైన మహిళా పరిశ్రామిక వేత్తలకు తమ బిజినెస్ అభివృద్ధిని వేగవంతం చేసుకొని తమ ఆదాయాన్ని పెంచుకునే అవకాశం లభిస్తుంది అని వీ హబ్ డైరెక్టర్ జాహిద్ షేక్ తెలిపారు. దీనిలో భాగంగా టెక్స్టైల్స్, ఫుడ్ మాన్యు ఫాక్చరింగ్, హస్త కళలు వంటి రంగాల్లోని వ్యాపారులకు బిజి నెస్ నైపుణ్యాలపై శిక్షణ, ప్రొడక్ట్ డెవల ప్మెంట్, డైవర్సిఫికేషన్, బ్రాండింగ్, మార్కెట్ యాక్సెస్, క్రెడిట్ లింకేజ్, ఎక్స్పర్ట్ మెంట రింగ్ మద్దతు అందనుందని వీ హబ్ అసోసి యేట్ డైరెక్టర్ ఊహ తెలిపారు. ప్రోగ్రాం పైన అవగాహన కల్పించి మహిళల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ప్రణయ్ కుమార్, డీ.ఆర్.డీ.ఓ మొగులప్ప, వీ హబ్ అసోసియేట్ డైరెక్టర్ శ్రీ ఊహ, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సాయి రామ్ పాల్గొన్నారు.

## ఫిర్యాదుల పట్ల చర్యలు తీసుకోవాలి

- జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు



**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 4 (జనం సాక్షి)**
బాధితుల నుండి వచ్చిన ఫిర్యాదుల పట్ల వెంటనే స్పందించి చట్ట ప్రకారం చర్యలు చేపట్టాలని జోగులాంబ గద్వాల జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు పోలీస్ అధికారు లను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 21 మంది బాధితుల ఫిర్యాదులను జిల్లా ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భూ వివాదాల కు సంబందించిన ఫిర్యాదులు, కొడుకులు తల్లిదండ్రులు లను చూడక పోవడం, భార్య భర్తల మధ్య వేధింపుల ఫిర్యాదులు, గొడవలు, లైంగిక వేధింపులకు సంబంధించిన పిర్యాదులను జిల్లా ఎస్పీ పరిశీలించారు. ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకొవాలని సంబంధిత ఎస్సై లను, సీ.ఐ లను జిల్లా ఎస్పీ ఆదేశించారు. డి.ఎస్పి వై.మోగి లయ్య, అలంపూర్, గద్వాల సీఐ లు రవి బాబు, టాటా బాబు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని సమస్యలను పరిష్కరించాలి



– ఎబివిపి నాయకులు

**మఖ్తల్, ఆగస్టు 04 (జనంసాక్షి)**
మఖ్తల్, మాగనూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్‌కు ప్రజావాణిలో ఎబివిపి నాయకులు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఎబివిపి రాష్ట్ర నాయకులు వినయ్ కుమార్ కలెక్టర్‌కి సమస్యల గురించి వివరించారు. మఖ్తల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 500 మందికిపైగా విద్యార్థులు ఉన్నత విద్య కోసం గ్రామాల నుండి వస్తున్న విద్యార్థులకు శిథిలావస్థకు చెందిన పాత భవనంలోనే పాఠాలను వింటున్నారు. పైన స్లాబ్ ఎప్పుడు కూలి తలపై పడుతుందో అనే భయంతో బిక్కుబిక్కుమంటున్నారు. కనీసం కూర్చోడానికి బెంచీలు కూడా లేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. బాలికలకు 300 మందికి 3 మూత్రశాలలే ఉండడంతో బహిరంగ కూడా వెళ్ళలేక సమస్యలతో సతమతమవుతున్నారు. బాలురకు అయితే అసలు మరుగుదొడ్లే లేక బహిరంగ ప్రదేశాల వెళ్ళలేక తీవ్రంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. విద్యార్థులకు తగినన్ని శౌచలయలు, పెచ్చులు ఊడుతున్న స్లాబ్ లు, తరగతి గదులో బీటలు పారిన గోడలు, ఉర్దూ మీడియం, ఒకేషనల్ తరగతి గదులో సరిపడ బెంచీలు లేవు. వర్షా కాలంలో కళాశాల మైదానంలో నీరు నిలుస్తున్న సందర్భాలలో కీటకాలు, విష సర్పాలు వస్తుంటాయి. ప్రహరీ గోడలు లేక పందులు స్వైర విహారం చేస్తున్నాయి. అసాంఘిక కార్యక్రమాలు కూడా నిలువగా మారిందని అత్యంత దారుణంగా ఉన్న పరిస్థితుల, విద్యార్థులు సమస్యలతో సవాసాలు గురించి అడిషనల్ కలెక్టర్ కు వివరించారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎబివిపి నాయకులు కలెక్టర్ ని కోరారు. ఈ కార్యక్రమంలో ఎబివిపి నాయకులు జిల్లా కన్వీనర్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ రంగనాయక స్వామిని దర్శించుకున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి





**జడ్చర్ల, ఆగస్టు 4 (జనంసాక్షి):**
జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని బాదేపల్లి పెద్ద గుట్టపై వెలిసిన శ్రీ రంగనాయక స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న శ్రావణ మాస ఉత్సవాలలో భాగంగా సోమవారం శ్రీ రంగనాయక స్వామిని మాజీ మంత్రి, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ సి. లక్ష్మారెడ్డి దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా దేవాలయ పరిరక్షణ కమిటీ అధ్యక్షులు కాల్వ రామిరెడ్డి దంపతులు మాజీ మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. రంగనాయక స్వామి దర్శనానంతరం వేద పండితులు మాజీ మంత్రికి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం కాల్వ రామిరెడ్డి దంపతులు మాజీ మంత్రిని శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, కౌన్సిలర్లు నవనీత, ఉమా శంకర్ గౌడ్, ప్రశాంత్ రెడ్డి, దోరేపల్లి లక్ష్మి, లత, నాయకులు రఘుపతి రెడ్డి, పిట్టల మురళి, శ్రీకాంత్, ప్రనిల్ చందర్, శంకర్ నాయక్, వల్లూరు వీరేష్, పర్వత్ రెడ్డి, కృష్ణారెడ్డి,



సత్య నారాయణ, అంజిబాబు తదితరులు స్వామిని దర్శించుకున్నారు.



## చించోడ్ అభిమన్యు రెడ్డి ఆర్థికసాయం

**రాజాపూర్, ఆగస్టు 04 (జనంసాక్షి) :**
మండల పరిధిలోని నందిగామకు చెందిన బొల్ల బాలమ్మ అనారోగ్యంతో మరణించారు. ఆమె మృతికి బిఆర్ఎస్ పార్టీ యువనేత చించోడ్ అభిమన్యు రెడ్డి సంతాపం తెలిపి, అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం కుటుంబ సభ్యులకు రూ.5000 ఆర్థిక సహాయన్ని యువసేన సభ్యుల ద్వారా అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ పెంటయ్య, మాజీ ఎంపిటిసి శేఖర్ గౌడ్, మాజీ ఉప సర్పంచ్ వెంకటయ్య గౌడ్, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ నారాయణ, రాజు, బాల్ చెన్నయ్య, సత్తయ్య, వార్డ్ మెంబర్ ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

## ఘనంగా గట్టు యాదవ్ జన్మదిన వేడుకలు



**వనపర్తి,ఆగష్టు04(జనంసాక్షి):** వనపర్తి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు గట్టు యాదవ్ 54వ జన్మదిన వేడుకలను సోమవారం మాజీ మంత్రి సింగిరెడ్డి నివాస గృహంలో ఆ పార్టీ శ్రేణులు జరుపుకున్నారు. ముందుగా జిల్లా పార్టీ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్,పట్టణ పార్టీ అధ్యక్షులు పలుస రమేష్ గౌడ్ శాలువాతో గట్టు యాదవ్‌ను సన్మానించి కేక్ కట్ చేసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా మీడియా కన్వీనర్ గట్టు యాదవ్ జీవితములో స్వశక్తితో ఎదిగి మున్సిపల్ చైర్మన్, జిల్లా అధ్యక్షులు స్థాయికి చేరుకున్నారని అన్నారు. ఆయురారోగ్యాలతో అష్ట ఐశ్వర్యాలతో నిండు నూరేళ్ళు ఉండి, మరెన్నో ఉన్నత పదవులు అలంకరించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమములో మాజీ కౌన్సిలర్లు బండారు కృష్ణ,ఉంగ్లం తిరుమల్, నాగన్న యాదవ్, కంచె రవి,స్టార్రహీమ్, షేక్ జహంగీర్,జోహెబ్ హుస్సేన్, హేమంత్ ముదిరాజ్, డాక్టర్ డ్యానియల్,యుగంధర్ రెడ్డి,చిట్యాల రాము,ఆరీఫ్ పాషా,క్రాంతి,మేస్త్రీ శ్రీనివాసులు,కృష్ణయ్య పాల్గొన్నారు.

## జర్నలిస్టులు నిజాయితీ నిబద్ధతతో పనిచేయడం అలవర్చుకోవాలి

**- టియుడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర కార్యదర్శి జి.మధు గౌడ్**

**వనపర్తి బ్యూరో ఆగస్టు 4 జనంసాక్షి**
జర్నలిస్టులు నిజాయితీ నిబద్ధతతో పనిచేయడం అలవర్చుకోవాలని రాష్ట్ర కార్యదర్శి జి.మధు గౌడ్ అన్నారు.తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్స్ వనపర్తి జిల్లా కార్యవర్గ సమావేశం ను సోమవారం జిల్లా కేంద్రంలోని యూనియన్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా టిఎఇఎంజె అధ్యక్షులు చీర్ల ఆంజనేయులు అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథులుగా టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శితో పాటు రాష్ట్ర హౌసింగ్ సొసైటీ సభ్యులు శ్రీనివాసరావు, జాతీయ కౌన్సిల్ మాజీ సభ్యులు మల్యాల బాలస్వామి, జిల్లా అధ్యక్షులు డి. మాధవరావు,జిల్లా కార్యదర్శి బి.రాజు, పట్టణ అధ్యక్షులు టి.అరుణ్ రాజ్ లు పాల్గొని మాట్లాడారు. సమావేశంకు ముందుగా యూనియన్ కార్యదర్శి నరసింహారాజ్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్ మాట్లాడుతూ జర్నలిస్టులు నిజాయితీ నిబద్ధతతో పనిచేయడం అలవర్చుకోవాలని అన్నారు. జర్నలిస్టుగా ఉన్న సమస్యలను పరిష్కరించడంలో యూనియన్ అగ్రభాగాన నిలుస్తుందని అన్నారు. ఇప్పటికే సాధించిన పలు అంశాల గురించి ఆయన వివరిస్తూ విద్య విషయంలో,ఆరోగ్యం విషయంలో యూనియన్ పరంగా సహ కరిస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. త్వరలో వనపర్తి జిల్లాలో కూడా జర్నలిస్టులకు పునఃశ్చరణ తరగతులు ఏర్పాటు చేస్తామన్నారు. సీనియర్ జర్నలిస్టులను గౌరవించడం మన యూనియన్ సాంప్రదాయమని అందరూ పాటించాలని ఆయన సూచించారు. వనపర్తి జిల్లాలో 25 సంవత్సరాలుగా పనిచేస్తున్న సీనియర్ జర్నలిస్టు లందరికీ యూనియన్ జిల్లా శాఖ తరపున ఘనంగా సత్కరించాలని కూడా నిర్ణయించినట్లు తెలిపారు.ఈ సమావేశంలో ముందుగా ఇటీవల మరణించిన జర్నలిస్ట్ తోకల సురేష్ మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. కార్యక్రమంలో హెచ్ఎంటీవీ బాలవర్ధన్,సాక్షి టీవీ సురేష్, సంద రాములు, టీ న్యూస్ మహేష్, ఏఎన్ఎన్ టీవీ ఈశ్వర్, బిగ్ టీవీ అరుణ్ కుమార్, టీవీ6 రవి, దిశ టీవీ అలీం, జర్నలిస్టు టుడే ఫారూఖ్ పటేల్, వి6 నరేందర్, 6టీవీ ముక్తార్, 10 టీవీ మురళి, ఐ న్యూస్ మన్యం, 95 టీవీ విష్ణు, ఇండియా టీవీ మన్యం, నేటి లీడర్ ప్రకాష్, భారత్ టుడే రమేష్, డివై న్యూస్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.




# అధిక లాభాల ఆశకు నకిలీ ఎరువుల అమ్మకం




**కొమురవెల్లి (జనం సాక్షి) :**
పంటలకు పనిచేయని నకిలీ ఎరువు బస్తాల దందా జిల్లాలో కొనసాగుతుందని దీన్ని అధికారులు అరికట్టాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం రైతు సంఘం కార్యాలయంలో సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ పంటలకు పనిచేయని ఎరువు బస్తాల అమ్మకాలు జరుగుతున్న వ్యవసాయ అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. పేరున్న కంపెనీల ఎరువుల బస్తాలను దుకాణాలలో కృత్రిమ కొరత సృష్టించి, అధిక లాభాల కోసం పనిచేయని నాసిరకం ఎరువులు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారని వాపోయారు. ఈ నాసిరకం ఎరువుల దందా చేర్యాల కొమరవెల్లి మండలాల్లో గత సంవత్సరం నుంచి జోరుగా జరుగుతుందని తెలిపారు. ఇంత జరుగుతున్న వ్యవసాయ అధికారులు ఎందుకు పట్టించుకో వడంలేదని ప్రశ్నించారు. వర్షాలు లేక రైతులు ఇబ్బందులు పడుతుంటే నాసిరకం ఎరువు బస్తాలతో పంటలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాసిరకం ఎరువుల బస్తాలు వాడిన రైతులు వాటి పనితీరు సరిగా లేకపోవడంతో తిరిగి ఇతర కంపెనీ ఎరువులను వాడి ఆర్థిక నష్టానికి గురవుతున్నారని చెప్పారు. ఎరువుల షాపుల డీలర్లకు మండల వ్యవసాయ అధికారులు లాలూచీపడి వారికి వత్తాసు పలుకుతున్నారని తీవ్రంగా ధ్వజమత్తారు. ఈ దందా రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతుందని వెంటనే వ్యవసాయ ఉన్నతాధికారులు స్పందించి దీన్ని అరి కట్టాలని డిమాండ్ చేశారు. అన్ని ఫర్టిలైజర్ షాపులలో అన్ని కంపెనీల ఎరువులు పురుగు మందులు అందుబాటులో ఉండేలా చూడాలని, అన్ని కంపెనీల వస్తువుల ధరల పట్టికను షాపుల ముందు ప్రదర్శించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులను ఏకం చేసి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహి స్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బద్దిపడగ కృష్ణారెడ్డి, సంగం మండల నాయకులు వుల్లంపల్లి సాయిలు, తాడూరీ మల్లేశం, నూకలశ్రీనివాస్, తాడూరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా వాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

**- అదనపు కలెక్టర్ రెవిన్యూ ఎస్. శ్రీను**

**నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి):** ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ రెవి న్యూ ఎస్. శ్రీను అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ప్రజావాణి సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 69 దరఖాస్తులు ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమ స్యలను అదనపు కలెక్టర్ రెవిన్యూ ఎస్. శ్రీనుకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటి కప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరిం చాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశిం చారు. ఫిర్యాదులపై చేపట్టిన చర్యల ను వివరిస్తూ అర్జీదారులకు సమాచారం తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ఎ.ఓ. జయసుధ తదితరులు పాల్గొన్నారు.






## హైమాస్ట్ లైట్ ఏర్పాటుకు స్థలం పరిశీలన

**వనపర్తి బ్యూరో ఆగస్టు 4 జనంసాక్షి :** వనపర్తి మున్సిపాలిటీ 12వ వార్డు రాజనగరంలో రానున్న బోనాల పండుగను దృష్టిలో ఉంచుకొని రాజనగరం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పోచమ్మ గుడి దగ్గర లైట్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మేఘారెడ్డిని కోరగా, వెంటనే స్పందించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రత్యేక చొరవతో హైమాస్ట్ లైటును సాంక్షన్ చేశారు. పోచమ్మ బోనాల పండుగ రోజు వరకు లైట్ ఏర్పాటు త్వరగా చేపట్టాలని వారు ఆదేశించారు. హైమాస్ట్ లైటు వెలుతురు పోచమ్మ గుడి వైపు, పెద్దమ్మ గుడి వైపు, చెరువుకు వెళ్లే దారి వైపు లైట్ వెలుతురు పడే విధంగా స్థలం పరిశీలించారు. హైమాస్ట్ లైటుకు సహకరించిన ఎమ్మెల్యే మేఘరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ రాజనగరం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు గొడుగు రామకృష్ణ, మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొత్త గొల్ల శ్రీనివాసులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నాగిరెడ్డి, దేశెట్టి ఉప్పరి రాములు, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు సారగండ్ల మన్యం, రాజనగరం మాలల సంఘం అధ్యక్షులు మల్లిపెద్ది వెంకటేష్, చంద్రయ్య, బొయ్య మున్నయ్య, కృష్ణయ్య, వనపర్తి జిల్లా యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ అంబటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి పాలమూరు జిల్లాలో మరో కొత్త రైల్వే లైను..!




రైల్వేస్టేషన్‌కు జడ్చర్ల, గద్వాల, కర్నూలు, డోన్, గుంతకల్ మీదుగా ట్రైన్లు వెళ్తున్నాయి. కృష్ణా-వికారాబాద్ మార్గం అందుబాటులోకి వస్తే హుబ్బళ్లి, గోవాలోని మడ్‌గావ్‌కు 35-40 కిలోమీటర్ల దూరం తగ్గే అవకాశం ఉంది. దీని ద్వారా తక్కువ సమయం లోనే హైదరాబాద్ నుంచి గోవాకు చేరుకోవచ్చు. అంతేకాకుండా, తాండూరు సిమెంటు పరిశ్రమల నుంచి సిమెంటు రవాణా సులభం అవుతుంది. ప్రస్తుతం గుంతకల్ మార్గంలో ట్రాక్ రద్దీగా ఉం డటంతో అదనపు రైళ్లను ప్రవేశపెట్టడం కష్టంగా మారింది. ఈ ప్రతిపాదిత మార్గంతో ఆ సమస్య ఉండదు. ఇది ప్రాంతీయ అభివృద్ధికి, వాణిజ్య కార్యకలాపాలకు ఊతమి స్తుందని అధికా రులు భావిస్తున్నారు. ఈ ప్రాజెక్టు రైల్వే బోర్డు ఆమోదం పొంది, త్వరితగతిన కార్యరూపం దాల్చాలని స్థానికులు, వ్యాపార వర్గాలు ఆశిస్తున్నాయి.

## శరవేగంగా ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గులు

**నర్వ (జనంసాక్షి):** నర్వ మండల పరిధిలో కల్వాల్లో గ్రామంలో సోమవారం ప్రభుత్వం ప్రతిష్టత్మ కంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా, మంత్రి వాకిటి శ్రీహరి చేతుల మీదుగా ప్రొసీడింగ్స్ అందుకున్న లబ్ది దారులకు, మంత్రి అదేశనుసారం అర్హులైన పేదల సొంత స్థలాల దగ్గర, హౌసింగ్ ఏఈ వినయ్గ్, పంచాయతీ కార్యదర్శి,రామాంజనేయులు గ్రామ కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో లబ్ధిదారులకు గృహ నిర్మాణం కోసం ముగ్గులు వేయడం జరిగింది. సొంత ఇంటి కల నెరవేర్చినందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వనికి,పేదల అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తున్న మంత్రి శ్రీహరికి ప్రజలు ధన్యవాదములు తెలిపారు.



# బాధితులకు అండగా నిలిచాం..

**ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నాం..**

**ఏడాది నరలో రూ. 250 కోట్లు మంజూరు చేశాం..**

**ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డికి అభినందనలు..**

**రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి..**

**ఉదండాపూర్ నిర్వాసితుల అంశంపై సీఎం ట్విట్టర్, ఫేస్ బుక్ లో పోస్ట్**



**జడ్చర్ల, ఆగస్టు 4 (జనం సాక్షి):** పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా ఉద్దండాపూర్ రిజర్వాయర్ పరిధిలో నిర్వాసితులుగా మారి గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి కన్నీళ్ల సాక్ష్యంగా మిగిలిన బాధితులకు అండగా నిలిచామని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. అధికారంలోకి వస్తే పరిహారం ఇచ్చి కన్నీళ్లు తుడుస్తామన్న హామీని నిలబెట్టుకున్నామని, ఏడాదినరలో రూ.250 కోట్ల పరిహారం మంజూరు చేశాం, ఇందులో రూ.25 కోట్లు గత నెలలో విడుదల, ఈ నెలలో మరో రూ.175 కోట్లు విడుదల చేశామని, ఈ నేపథ్యంలో నిర్వా సితులతో సహపంక్తి భోజనం చేసి డిసెంబర్ 9 లోపు పూర్తి పరిహారం అందిస్తామని నా మాటగా చెప్పాల్సిందిగా జడ్చర్ల శాసన సభ్యుడు జనంపల్లి అనిరుధ్ రెడ్డికి సూచించాను. అందుకు



6 వేల మందితో ఆదివారం సహపంక్తి భోజనం చేసి నా హామీ మేరకు వారికి భరోసా ఇచ్చిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డికి కు నా అభినం దనలు.. అంటూ సీఎం రేవంత్ రెడ్డి తన ఫేస్ బుక్, ట్విట్టర్ ఖాతాలో సోమవారం పోస్ట్ చేశారు. పోస్ట్‌తో పాటు ఎమ్మెల్యే సహపంక్తి భోజనాల ఫోటోలను పోస్ట్ చేశారు.

## ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన గ్రామ పంచాయతీని తొలగించాలని వినతి

**నారాయణపేట జిల్లా ప్రతినిధి (జనం సాక్షి):** ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం దామరగిద్ద మండలం క్యాతన్ పల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో గత 19 నెలల నుంచి గ్రామపంచాయతీ కార్యాలయం నిర్వహించారు పాఠశాలలో ప్రారంభం అయి మూడు నెలలు గడుస్తున్న పాఠశాలలో నిర్వహించిన గ్రామ పంచా యతీని తొలగించాలని, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లా కలెక్టర్ ఆఫీసులో ఏవో జయసుధకి వినపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయ కులు నరహరి మాట్లాడుతూ కేతన్ పల్లి గ్రామంలో 18 నెలలు నుంచి గ్రామపంచాయతీ ఆఫీసు ఎంపీపీ ఎస్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించడం వల్ల ఆ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గదులు సరిపోవడం లేక చెట్ల కింద కూర్చోబెడుతున్న పరిస్థితి కనపడుతుం దన్నారు. గ్రామపంచాయతీ అధి కారికి రెండుసార్లు విన్నవించిన కూడా ఆఫీసు తీయడం లేదని, ఆ పాఠశాలకు నూతనంగా కంప్యూటర్స్ అందించడం జరిగిందని, కానీ కంప్యూ టర్స్ పెట్టుకోవడానికి కూడా గదిలేక ఇబ్బంది పడుతున్నటువంటి పరిస్థితి మనకు కనిపిస్తుంది గ్రామ పంచాయతీని




నూతనంగా నిర్మించారు కానీ దాన్ని ఓపెనింగ్ చేయలేక రెండు సంవత్సరాలు అవుతున్న కూడా ఓపెనింగ్ చేయలేకపోతున్నారు. తక్షణమే అక్కడున్న విద్యార్థులకు చాలా ఇబ్బంది అవుతుంది కావున పాఠశాలలో ఉన్న ఆ గ్రామపంచాయతీని తక్షణమే తొలగించాలని కోరారు. లేని ఎడల ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎంపీడీ వో ఆఫీసు ముట్టడించడానికి అయినా సంసిద్ధంగా ఉన్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పవన్ కుమార్, జిల్లా అధ్యక్షులు భాను ప్రసాద్ దామరగిద్ద మండలం ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు అశోక్, వ్యవసాయ కార్మిక సంఘం శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేయాలి

**- ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి విజయ్ కుమార్**



**నారాయణపేట జిల్లా ప్రతినిధి (జనం సాక్షి):** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ లను నెరవేర్చాలని బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్. విజయ్ కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు రెండు ఏళ్ళు అవుతున్న చేసిన అభివృద్ధి శూన్య మని విమర్శించారు. ఇంతవరకు ఆసరా పింఛన్లు 4 వేలకు పెంచలేదని, ప్రతి గృహిణికి 2వేల 5వందలు, వ్యవసాయ కూలీలకు 12 వేల రూపాయలు ఇస్తామని అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందనీ విమర్శిం చారు. అరకొర ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి అవికూడా అధికార పార్టీకి చెందిన వాటికే ఇస్తున్నారని ఆరోపించారు. ఈ ప్రభుత్వానికి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు.

## ప్రభుత్వ ఆస్పత్రిలో సౌకర్యాలు కల్పించాలి : పివైఎల్

**నారాయణపేట జిల్లా ప్రతినిధి (జనం సాక్షి):** నారాయణపేట పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిని గడ్డమీద అప్పక్పల్లి కి తరలించడంతో ప్రజలకు పేషంట్లకు అక్కడ ఇబ్బంది పడుతున్నా రని అక్కడ పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించా లని రోగులకు అందుబాటులో అంబులెన్స్ సౌక ర్యాలు బస్సు సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వ ఆసుపత్రి డిప్యూటీ సూపర్డెంట్ డాక్టర్ ఆదిత్యను పివైఎల్ జిల్లా అధ్యక్షుడు ప్రతాప్ ప్రధాన కార్యదర్శి సిద్ధు, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు సాయి కుమార్ కోశాధికారి మహేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణ కోరారు.

సోమవారం ఒక కేసుకు సంబంధించి డిప్యూటీ సూపరిడెంట్ డాక్టర్ ఆదిత్య తో వారు మాట్లాడుతూ పూర్తి వివరాలు తెలుసుకొని ఆస్పత్రిలో ప్రజలకు రోగులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పూర్తిస్థాయి లో



రవాణా సౌకర్యం కల్పించాలి అని అలాగే పేషంట్లకు అంబులెన్స్ సౌకర్యం కూడా ఏర్పాటు చేయాలని అన్నారు. తాగు నీటి సౌకర్యం అలాగే వచ్చేది వర్షాకాలం కాబట్టి ముందు జాగ్రత్తగా ప్రజలకు ఇబ్బంది పడకుండా షెడ్లు ఏర్పాటు చేయాలని అన్నారు. అలాగే ఓపి ఒకటే ఉండడం తో ఉదయం నుంచి ప్రజలు క్యూలో నిలబడి ఎక్కువమంది ఇబ్బంది పడుతున్నారని మరో ఓపి క్యాబిన్ ఓపెన్ చేయాలని సూచించారు.

# ప్రజావాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించండి

## అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్. కీమ్యా నాయక్



**వనపర్తి బ్యూరో ఆగస్టు 4 జనంసాక్షి**

ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్. కీమ్యా నాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, ఆర్డీఓ సుబ్రమణ్యంతో కలిసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, ఫిర్యాదు దారులకు తగిన సమాచారం అందించాలని సూచించారు. ముఖ్యమంత్రి ప్రజావాణి, మంత్రి ద్వారా ఈ జిల్లాకు సంబంధించిన ప్రజావాణి ఫిర్యాదులు, ప్రతి సోమవారం జిల్లా ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణికి మొత్తం 53 ఫిర్యాదులు వచ్చాయి.

అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఇన్చార్జి యాదయ్య ఇప్పటివరకు ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న ముఖ్యమంత్రి కార్యాలయం నుండి వచ్చిన ప్రజావాణి దరఖాస్తులు, మంత్రి నుండి వచ్చిన దరఖాస్తులు, కలెక్టర్ కార్యాలయాని వచ్చిన దరఖాస్తుల పెండింగ్ వివరాలను వివరించారు. వచ్చే వారం లోగా దరఖాస్తులు అన్ని పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### అదనపు (రెవెన్యూ) కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఎన్. కీమ్యా నాయక్



అదనపు కలెక్టర్ రెవెన్యూ విధులు నిర్వహిస్తున్న జి. వెంకటేశ్వర్లు ఫ్యూచర్ సిటీకి బదిలీ అయినందున వారి స్థానంలో కొత్తగా వచ్చిన ఎన్.కీమ్యా నాయక్ సోమవారం వనపర్తి కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. కొత్తగా వచ్చిన అదనపు కలెక్టర్‌కు పరిపాలన అధికారి భాను ప్రకాష్ పుష్ప గుచ్ఛంతో స్వాగతం పలికారు.

# ఉమామహేశ్వరులకు వైభవంగా లక్ష బిల్వార్చన



**మక్తల్ , ఆగస్టు 4 (జనంసాక్షి)**

మక్తల్ పట్టణంలోని ఆజాద్ నగర్ లో వెలిసిన శ్రీ ఉమామహేశ్వరాలయం 13వ వార్షిక ఉత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీ ఉమా మహేశ్వరులకు లక్ష బిల్వార్చన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఆలయ వార్షిక ఉత్సవాల్లో భాగంగా తెల్లవారుజామున 4:30 గంటలకు ఆలయ అర్చకులు సిద్దిరామయ్య స్వామి ఆధ్వర్యంలో మహాన్యాస రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. అనంతరం కలశస్థాపన, గణపతి పూజ, సుబ్రహ్మణ్య స్వామి, పూజ నాగ దేవతల పూజ, సకల దేవతల పూజా కార్యక్రమం భక్తి శ్రద్దల మధ్య అత్యంత వైభవంగా నిర్వహించారు. భగవధ్వజారోహణంతో లక్షబిల్వార్చన కార్యక్రమానికి అంకురార్పణ జరిగింది. తదుపరి మహిళలచే అమ్మవారికి కుంకుమార్చన గావించారు. అనంతరం నిర్వహించిన లక్షబిల్వార్చన కార్యక్రమంలో భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో శ్రీ ఉమా మహేశ్వరులకు బిల్వ పత్రం సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. లక్షబిల్వార్చన సందర్భంగా శివనామస్మరణతో పట్టణం మారుమోగిపోయింది. శివాయ నమః ఓం నమశివాయ, సాంబ సదాశివ సాంబ సదాశివ సాంబశివ ,శంభో శంకర హర హర మహాదేవ అంటూ పెద్ద ఎత్తున భక్తులు చేపట్టిన శివనామస్మరణతో మక్తల్ మారుమోగింది. ఈ సందర్భంగా అర్చకులు సిద్దిరామయ్య స్వామి మాట్లాడుతూ మహాశివుడికి ఎంతో ప్రీతిపాత్రమైనది బిల్వపత్రము అని అన్నారు. పువ్వులు బిల్వపత్రి సమర్పిస్తే స్వామివారికి బంగారం సమర్పించినట్లు అన్నారు. గంగాజల అభిషేకం బిల్వపత్రి సమర్పణ స్వామివారికి ఎంతో ప్రీతి పాత్రమైనదని భక్తితొ సమర్పించి మనసులో కోరికలు కోరుకుంటే నెరవేరుతాయని అన్నారు. భక్తులకు ఇలవేల్పు శ్రీ ఉమామహేశ్వర స్వామి వారి వార్షిక ఉత్సవాల్లో లక్ష బిల్వార్చన లో పాల్గొన్న భక్తులు స్వామి వారికి భక్తితో పత్రం సమర్పించి కోరుకున్న కోరికలు స్వామివారు నెరవేరుస్తారని అన్నారు. ప్రతిరోజు శివనామస్మరణ భగవన్నామస్మరణ విధిగా చేయాలని ఆయన సూచించారు. భగవన్నామ స్మరణను మించింది మరొకటి ఉండదని పేర్కొన్నారు. కుంకుమ బిల్వ పత్రి గంగా జలం సమర్పించుకోవడం ద్వారా కార్యాలను తీర్చుకోవాలని సూచించారు. స్వామివారికి అలంకరణ మహామంగళహారతి భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేపట్టారు.అనంతరం బికెఆర్ ఫౌండేషన్ చైర్మన్ గవినోళ్ళ బాలకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సిద్దిరామయ్య స్వామి, అర్చకులు మహేష్,చెన్నబసవ స్వామి, శివ స్వామి, ఆలయ కమిటీ సభ్యులు రాజుల ఆశిరెడ్డి, బి.ఆంజనేయులు సూర్య, సి.వి.అంజనేయులు, పోలేపల్లి అనంత కుమార్, బి. శ్రీనివాసులు, చిన్న కృష్ణయ్య, శుభోదయ రాములు, వంశీ, సివి.నవీన్, నాని, జానమోళ్ళ పాపిరెడ్డి, బి.నాగరాజు, నవీన్, యం.శ్రీనివాసులు, బి.ఆంజనేయులు, గుడిగండ్ల నర్సింహారెడ్డి, గాసం సత్యనారాయణ, అను, కాళమ్మ, శారద, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# స్కూల్ కనెక్ట్ ప్రోగ్రామ్‌కు ఎంపికైన కోడుగల్ విద్యార్థులు

**- ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు**

**జడ్చర్ల, ఆగస్టు 4 (జనంసాక్షి):**

మండల పరిధిలోని కోడుగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఐఐటి మద్రాస్ స్కూల్ కనెక్ట్ ప్రోగ్రాంకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మారేపల్లి శ్రీనివాసులు తెలిపారు. సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు మీడియాకు తెలుపుతూ ఐఐటి మద్రాస్ నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మకమైన స్కూల్ కనెక్ట్ ప్రోగ్రాంకు కోడుగల్ విద్యార్థులు ఎంపిక కావడం జరిగిందని, ఈ ప్రోగ్రాం ద్వారా పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డేటా సైన్స్ కోర్సుల్లో శిక్షణ అందిస్తారని, 8 వారాలపాటు ఆన్ లైన్ క్లాసుల ద్వారా శిక్షణ అందిస్తారని, వీడియోలు, లైవ్ ఇంటరాక్టివ్ సెషన్లు, అసైన్మెంట్లు, కంప్యూటర్ ఆధారిత పరీక్షలలో విద్యార్థులు



అనుభవసారమైన నైపుణ్యాభివృద్ధికి అనుగుణంగా శిక్షణ పొందుతా రని, శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు ఐఐటి మద్రాస్‌లోని సి.ఓ.డి.ఈ విభాగం నుంచి అధికారిక ధ్రువ ప్రభుత్వం లభిస్తుందని తెలిపారు. ప్రోగ్రాం సమన్వయకర్తగా గణిత ఉపాధ్యాయుడు శశిధర్ సింగిల్ పాయింట్ ఆఫ్ కాంట్రాక్ట్ ఐఐటి మద్రాస్, పాఠశాల స్థాయిలో కార్యక్రమాలు నిర్వహణ బాధ్యతలు నిర్వహిస్తున్నారని, ఇలాంటి అవకాశాన్ని అందించడంలో సహకరించిన తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ, జిల్లా విద్యాశాఖ అధికారి, ఐఐటి మద్రాస్ బృందానికి పాఠశాల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ప్రధానోపాధ్యా యులు మారేపల్లి శ్రీనివాసులు, ఉపాధ్యాయులు శశిధర్, మల్లికార్జున్ ప్రత్యేక చొరవతో విద్యార్థుల ను కోర్సులలో నేర్పించడం జరిగిందన్నారు.



## బనదేశ్వర స్వామి ఆలయానికి భక్తుల తాకిడి

**నారాయణపేట ఆగస్టు 04 (జనం సాక్షి):**

శ్రావణ సోమవారం సందర్భంగా తెలంగాణ సరిహద్దు ప్రాంతంలోని కర్నాటక రాష్ట్రం, గుర్మిట్కల్ నియోజకవర్గ పరిధిలోని కాళెబెళగుందిలో వెలసిన శ్రీ బనదేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, మహామంగళహారతి కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తుల కోరిక మేరకు హారికే రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. రథోత్సవాన్ని భక్తులు కన్నులరా తిలకించారు. భక్తులు భక్తిశ్రద్దలతో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కొందరి ఇంటి ఇలవేల్పు అయిన బనదేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడే పిండి వంటలు చేసి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదలు పంచి పెట్టారు. శ్రావణ సోమవారం కావడంతో ఆలయం భక్తులతో కిక్కిరిసింది.

## ఘనంగా యువనేత సరోజ్ జన్మదిన వేడుకలు



**భూత్పూర్ ఆగష్టు04 (జనంసాక్షి):**

పట్టణంలో బిఆర్ఎస్ యువ నేత మందడి సరోజ్ జన్మదినం సందర్భంగా సోమవారం నాడు బీఆర్ఎస్ నాయకులు, మాజీ మున్సిపల్ చైర్మన్ బస్వరాజు గౌడ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. సరోజ్ వ్యవసాయ క్షేత్రంలో భారీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గిరిజన యువకులతో కలిసి ఆయనతో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపినట్లు పేర్కొన్నారు. గత కొన్నేళ్లుగా సామాజిక కార్యక్రమాలు చేపడుతు,అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం అహర్నిషలు కృషి చేస్తున్నారని కొనియాడారు. రాబోయ్యే రోజుల్లో దేవరకద్ర గడ్డపై గులాబీ జెండా ఎగరేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, సాధీక్, అశోక్ గౌడ్,సురేష్, రాములు, బాల్ రెడ్డి, తిరుపతయ్య, రాకేష్,ప్రేం తదితరులు పాల్గొన్నారు.

## క్షయ వ్యాధి నిర్మూలన దిశగా గద్వాల జిల్లా అడుగులు

**మల్దకల్ ఆగస్టు 4(జనంసాక్షి)**

డిఎంహెచ్వో డాక్టర్.ఎస్. కె. సిద్ధప్ప ఆదేశాల మేరకు ప్రోగ్రాం ఆఫీసర్ టీబిడాక్టర్.జి.రాజు ఆధ్వర్యంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మల్దకల్ మండల పరిధిలో పాల్వాయి గ్రామంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఎక్రే క్యాంపు నిర్వహించారు. పాలవాయి, పెద్దపల్లి, పావనంపల్లి, బూడిదపాడు,టీబి హైరిస్క్ పాపులేషన్‌ను స్క్రీనింగ్, అనుమానితులకు ప్రత్యేక ఎక్స్ రే పరికరము ద్వారా పాల్వాయి సెంటర్ నందు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. 60 సంవత్సరాల పైబడిన వారు అండర్ వెయిట్, పొగ తాగువారు, మద్యపానం సేవించువార,ఓల్డ్ టీబీ పేషెంట్స్,హైరిస్క్ ఏరియాలో ఉన్నవారికి,రక్తపోటు దయాబెటిక్ ఉన్నవారికి గుర్తించి వారికి 74 ఎక్సరే పరీక్షలు,బిపి ఇతర ఐసీటీసీ 102 మందికి రక్త పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ స్వరూప రాణి క్షేత్రస్థాయి సిబ్బందికి గ్రామపరిధిలో ఉన్న మొదట టీబి అనుమానిత లక్షణాలు ఉన్నవారిని గుర్తించాలని అనుమానితులను గల్ల పరీక్షలు లేదా ఎక్రే పరీక్షలు చేపించి వారికి తగిన చికిత్సలు ఇవ్వాలని తెలిపారు. పాజిటివ్ వచ్చిన వారిని ఆరు నెలల పాటు వారికి మందులు సమయంలో ఇస్తూ ఫాలోపు ఉండాలని, ఒక్కరిని వదిలినా సమాజంలో టీ బి వ్యాప్తి పెరిగిపోతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రణిత, ఎంఎల్‌హెచ్‌పి సూపర్వైజర్,శ్రీధర్, హెల్త్ అసిస్టెంట్ దేవన్న, ఏఎన్ఎం లు మనోహరమ్మ,పద్మ,ఆశా కార్యకర్తలు,టి బి అలర్ట్ ఇండియా వెంకటేష్, ఉదయ్,నరేందర్,ల్యాబ్ టెక్నీషియన్లుపాల్గొన్నారు.





## కేజీబీవీలో తనిఖీలు

**రాజాపూర్, ఆగస్టు 04 (జనంసాక్షి) :** హైదరాబాద్ నుండి విద్యాశాఖ ఉన్నతాధికారి జెడి వెంకట్ నర్సమ్మ రాజాపూర్ మండల కేంద్రంలో కేజీబీవీ రాజాపూర్, భవిత సెంటర్, జెడ్‌పిహెచ్‌ఎస్ రాజాపూర్ పాఠశాలలను సోమవారం నాడు సందర్శించి ప్రభుత్వం కల్పించిన అన్ని వసతులను పరిశీలిం చారు. మంచినీటి వసతి, పాఠశాలలో పరిశుభ్రత, వంటగది, టాయిలెట్స్ పరిశీలించి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సూచనలు సలహాలు తెలియజేశారు. తరగతి గదులు పరిశీలించి ఉపాధ్యాయుల బోధనా పద్ధతులను గమనించారు. జెడి వెంకట్ నర్సమ్మ వెంట మండల ఎంఈఓ సుధాకర్ ,జడ్చర్ల మండల ఎంఈఓ మంజులాదేవి ఉన్నారు.

## మార్కెట్ యార్డ్ అభివృద్ధికి రూ. 1.75 కోట్ల నిధులు మంజూరు



**జడ్చర్ల, ఆగస్టు 4 (జనంసాక్షి):** జడ్చర్ల వ్యవసాయ మార్కెట్ యార్డ్ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా, గాల్వాలూమ్ షీట్ రూఫింగ్‌తో కూడిన కవర్డ్ షెడ్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 1.75 కోట్ల నిధులను సోమవారం మంజూరు చేసిందని, ఈ నిధుల మంజూరుకు జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి ప్రత్యేక కృషి చేసినట్లు మార్కెట్ యార్డ్ అధికారులు తెలిపారు. ఈ నూతన కవర్ షెడ్ నిర్మాణం ద్వారా రైతులకు వర్షాలు, ఎండల సమయంలో కూడా మద్దతు ధరపై ధాన్యం అమ్మే అవకాశాలు మెరుగవుతాయని, మార్కెట్ యార్డ్ పరిధిలో వృద్ధి చెందుతున్న వ్యవసాయ లావాదేవీలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్మాణం కీలకంగా మారనుందన్నారు. ఈ సందర్భంగా మార్కెట్ చైర్ పర్సన్ జ్యోతి రెడ్డి, కార్యవర్గ సభ్యులు, రైతులు, మార్కెట్ యార్డ్ ఉద్యోగులు ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ చేసిన బిఆర్ఎస్ నాయకులు

**చేర్యాల ఆగష్టు 04 (జనంసాక్షి) :**
జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి సహకారంతో 9వ వార్డ్‌లో బుడిగ శివరంజనికి మంజూరైన ఇందిరమ్మ ఇల్లుకు సోమవారం చేర్యాల పట్టణంలో బిఆర్ఎస్ నాయకులు కలిసి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ముస్త్యాల బాల్ నర్సయ్య, జిల్లా నాయకులు అంకుగారి శ్రీధర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు ముస్త్యాల నాగేశ్వరరావు, మాజీ ఏఎంసి వైస్ చైర్మన్ పూర్మ వెంకటరెడ్డి, యూత్ ఇంచార్జి శివగారి అంజయ్య, వార్డు ఇంచార్జి మంచాల కొండయ్య, నాయకులు నర్ర ఐలయ్య, పాక బాలయ్య, నర్ర యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



# ప్రజావాణిలో సీనియర్ సిటిజన్ ఫోరమ్ నుంచి వినతులు

### - కలెక్టర్ సమక్షంలో మోహన్ రావు పలు అభ్యర్థనలు

**గద్వాల నడిగడ్డ,ఆగస్టు 4 (జనం సాక్షి)**
జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ సమక్షంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ ఫోరం జిల్లా అధ్యక్షుడు మోహన్ రావు సోమవారం పలు ప్రజా ప్రయోజన అంశాలను అధికారుల కలెక్టర్ సంతోష్ దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన గద్వాల సం స్థానంలో రాజుల కాలం నాటి చారిత్రక ప్రాము ఖ్యత కలిగిన పురాతన బావిని పునరుద్ధరించాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. దీనిపై ఉన్న న్యాయపరమైన అంశాలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.స్మృతి వనం లోపల సందర్శకుల కోసం మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. అలాగే నిర్మాణంలో ఉన్న ఐటిఐ కళాశాల పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. దీంతో స్పందించిన జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను పిలిపించి టెండర్లు కాల్ ఫర్ చేయాలని ఆదేశాలు మౌకిక జారీ చేశారు.ఆరోగ్య రంగానికి ప్రాధాన్యం కల్పిస్తూ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో '2డి ఎకో మిషన్ సిటీ స్కాన్' వంటి ఆధునిక వైద్య సేవలు అందు బాటులోకి తీసుకురావాలని, అవసరమైన వైద్య సిబ్బందిని నియమించాలన్నారు. రోగులు, వారి బంధువుల కోసం ఆసుపత్రి ప్రాంగణంలో డైనింగ్ హాల్ నిర్మించాల్సిన అవసరాన్ని ఆయన ప్రస్తావించారు.



**నూతన మండలాల ఏర్పాటుపై విజ్ఞప్తి**
గద్వాల తాలూకాలను ఆధారంగా చేసుకుని కొత్త మండలాలను ఏర్పాటు చేయాలని కోరారు. ముఖ్యంగా జనాభా పరంగా బిజ్వారం గ్రామం అర్హత కలిగినందున దాన్ని మండలంగా ఏర్పాటు చేయాలని సూచించారు.

**నగరాభివృద్ధిలో అవకతవకలు అక్రమ నిర్మాణాలపై..**
గద్వాల పట్టణంలో అనుమతులు లేకుండా జరుగుతున్న అక్రమ నిర్మాణాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వీటి కారణంగా పెద్ద అగ్రహారం వెళ్లే ప్రధాన రహదారి ఇరుకుగా మారిందని తెలిపారు. దీంతో తక్షణం వాటిని పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ను జిల్లా కలెక్టర్ మౌఖికంగా ఆదేశించారు.

**నడిగడ్డ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి**
నడిగడ్డ ప్రాంత అభివృద్ధి కోసం నీతి అయోగ్‌కు ప్రత్యేక ప్రతిపాదన పంపించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్, అన్ని అంశాలపై సంబంధిత శాఖల అధికారులను సమన్వయం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

# డబ్బా పాలు వద్దు తల్లిపాలే ముద్దు






### నవజాత శిశువుకు తల్లిపాలే అమృతం లాంటివి
### ప్రతి బాలింత శిశువుకు తల్లిపాలే తప్పనిసరిగా ఇవ్వాలి
### బాలింతలకు 50 నవజాత శిశు కిట్ల పంపిణీ
### జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి న్యాయమూర్తి నసీం సుల్తానా

**నాగర్ కర్నూల్ ఆర్సీ, ఆగస్టు 4(జనంసాక్షి):**
తల్లిపాల వారోత్సవాలలో భాగంగా సోమవారం నాడు నాగర్కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి న్యాయమూర్తి నసీం సుల్తానా పాల్గొని ప్రసంగించారు. ఆమె మాట్లాడుతూ, తల్లిపాలు పుట్టిన శిశువుకు అమృతం లాంటిదని ప్రతి బాలింత తప్పనిసరిగా పాలించ సమయంలో శిశువులకు తల్లిపాలు ఇవ్వాలని ఆమె సూచించారు. ఆస్పత్రి మెడికల్ సూపర్డెంట్ డాక్టర్ టి ఉషారాణి మాట్లాడుతూ, మాతృత్వం మహిళలకు ఒక వరమని మాతృత్వం ఆస్వాదించుటలో శిశువుకు తల్లికి గల సంబంధమే ఎంతో గొప్పదని,పుట్టిన గంటలోపు తప్పనిసరిగా జన్మించిన ప్రతి శిశువుకు తల్లిపాలు పట్టించాలని ఆ సమయంలో పాలు గోధుమ రంగులో ఉంటాయని వాటినే మురుపాలంటారని, ముర్రుపాలు ప్రతి శిశువుకు ఇవ్వడంతో రోగనిరోధశక్తి జ్ఞాపకశక్తి ఆరోగ్య స్థితి మెరుగు పడటానికి ఎంతో దోహదపడతాయని ఆమె అన్నారు. తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటివి, బిడ్డను రోగాలబారి నుంచి రక్షించే దివ్యమైన ఔషధం అని అన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే తల్లి నుంచి వచ్చే ముర్రుపాలు పట్టడంతో శిశువులో రోగనిరోధక శక్తి పెర గడమే కాకుండా సంపూర్ణ ఆరోగ్యాన్ని ఇస్తాయని తెలిపారు.పోత పాలకంటే తల్లిపాలు తాగే పిల్లలు బలంగా మంచి ఐ.క్యూ, తెలివితే టలతో ఉంటారనీ అన్నారు. శిశు మరణాలు నివారించొచ్చనీ, ఎక్కువ మంది చంటి పిల్లల్లో ఇన్ఫెక్షన్ రావడం, పుట్ట గానే కామెర్లు, శ్వాసకోశవ్యాధులతో మరణాలు సంభవించడాన్ని నిరోధించవచ్చునని అన్నారు. అలాంటి మరణాలను నివా రించేందుకు పుట్టిన అరగంటలోపు తల్లిపాలు తాగించడం ద్వారా నెలలోపు శిశువుల్లో సంభవించే మరణాలను పూర్తి స్థాయిలో తగ్గించవచ్చని అన్నారు. స్త్రీ వైద్య నిపుణుల ప్రొఫెసర్ డాక్టర్ నీలిమ మాట్లాడుతూ బిడ్డకు పాలు ఇవ్వడం తల్లికీ ప్రయోజనమే అన్నారు. బిడ్డకు పాలిచ్చే తల్లులకు అండాశయ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్ వంటివి వచ్చే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయని అన్నారు. రక్తహీనత, ఎముకల బలహీనత వంటి జబ్బులు దరిచేరవని, బిడ్డకు పాలు ఇవ్వడంతో ప్రసవం అనంతరం అయ్యే రక్తస్రావాన్ని అదుపు చేస్తాయని అన్నారు. తల్లిపాల నుంచి శిశువుకు అన్ని పోషకాలు సమపాళ్లలో అందుతాయి. వ్యాధి నిరోధకశక్తిని కూడా పెంపొందిస్తాయనీ అన్నారు.తల్లిపాలు తాగిన శిశువుల్లో యాంటీబాడీస్ వృద్ధి చెందడమే కాకుండా ఇన్ఫెక్షన్లు నిమోనియా, డయే రియా వంటి వ్యాధులు సోకకుండా పూర్తిగా నివారించవచనీ అన్నారు. శిశువుకు ఆరోగ్య సమస్యలు రావడానికి ప్రధాన శత్రువు చలి, అందువల్ల తల్లి తన బిడ్డను ఒడిలో ఉంచుకొని పాలివ్వడంతో సరిపడా వేడి అందుతుందనీ, పాలుతాగించడంతో వ్యాధ రోగనిరోధక శక్తి పెరగడమే కాకుండా సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించొచ్చనీ తెలిపారు. డాక్టర్ నీలిమ బాలింతలకు నవజాత శిశువులకు ఉపయోగపడే 50 కిట్లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో రేసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రవి శంకర్ నాయక్, స్త్రీ వైద్యాన్నిపుణులు ప్రొఫెసర్ డాక్టర్ సుప్రియ, డాక్టర్ కోటేశ్వర్, డాక్టర్ కవిత, డాక్టర్ సౌమ్య, ప్రసూతి వైద్యులు, నర్సింగ్ ఆఫీసర్లు కోర్టు సిబ్బంది కేశవరెడ్డి, హెల్ప్ డెస్క్ ఇంచార్జ్ యాదగిరి ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు : ఏవో



**శివ్వంపేట ఆగస్ట్ 4 జనంసాక్షి:**
ఆయిల్‌పామ్ సాగు వల్ల రెట్టింపు ఆదాయం పొందవచ్చునని వరి పంటకు ప్రత్యామ్నాయంగా రైతులు ఈ పంటను సాగు చేయొచ్చునని మండల వ్యవసాయ అధికారి లావణ్య తెలిపారు. శివంపేట మండలం చిన్నగొట్టిముక్ల గ్రామంలో 3.14 ఎకరాల ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ మల్లేష్ అనే రైతు పొలంలో చేపట్టడం జరిగింది. ఈ ప్లాంటేషన్ ను సోమవారం ఏవో సందర్శించి, పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక ఎకరా వారికి సరిపోయే నీటితో నాలుగు ఏకరాల పామ్‌అయిల్ పంటను సాగు చేయొచ్చని ఆమె అన్నారు. ఎలాంటి మధ్యవర్తిత్వం లేకుండా నేరుగా కంపెనీ వాళ్ళే పామ్‌ఆయిల్ గెలలను కొనుగోలు చేస్తారని ఎకరానికి 57 చెట్లు వేసుకోవచ్చని ఒక చెట్టు 200 రూపాయలు ఉంటే ప్రభుత్వం 20 రూపాయలకే రైతులకు అందించడం జరుగుతుందని, అదేవిధంగా డ్రిప్ ఎస్సీ ఎస్టీ రైతులకి 100 శాతం, బీసీ రైతులకు 90 శాతం, ఓసి రైతులకి 80శాతం సబ్సిడీలతో ప్రభుత్వం అందుతుందన్నారు. పామాయిల్ వేసుకున్న రైతులకు రైతుబంధు తో పాటు సంవత్సరానికి రూ. 4200 ఎకరానికి సాగు ఖర్చుల కింద ప్రభుత్వం ఇస్తుందని కాబట్టి రైతులందరూ ఆయిల్ ఫామ్ వేసుకోవాల్సిందిగా ఆమె కోరారు. ఆయిల్‌పామ్ వెయ్యాలనుకునే రైతులు మండల వ్యవసాయ ఆఫీసుకురావాలని లేదా 8977725906 కు ఫోన్ చేయాల్సిందిగా ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈవో వినీత, భవాని కంపెనీ ప్రతినిధి అజయ్ కుమార్ ఉన్నారు.

# మీనాక్షి నటరాజన్‌ను కలిసిన పవన్ కుమార్ సమావేశం

**నంగునూరు, ఆగస్టు 4, (జనం సాక్షి)**
ఢిల్లీ చలో కార్యక్రమంలో భాగంగా అఖిల భారతీయ కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్‌ను సిద్దిపేట జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సాదుల పవన్ కుమార్ సోమవారం ప్రత్యేకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల అంశంపై చర్చించారు. పార్టీలో యువతకు తగిన అవకాశాలు కల్పించాలని కోరారు. పార్టీలో ఉన్న సమస్యలపై సాదుల పవన్ కుమార్ విశ్లేషణాత్మకంగా మీనాక్షి నటరాజన్‌కు వివరించారు. మీనాక్షి నటరాజన్ ఆయన ఆవేదనను క్షుణ్ణంగా విని, తగిన చర్యలు తీసుకోవడానికి అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. యువ నాయకుల అభిప్రాయాలు పార్టీలో మార్పులకు దారి తీసేలా ఉండేలా చూసేందుకు తమ పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు.



# నానో యూరియాపై అవగాహన : ఏవో

**చిలప్ చేడ్, ఆగస్టు 4, జనంసాక్షి :**
వ్యవసాయ రంగంలో నూతనంగా వస్తున్నటువంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు అలవర్చుకోవాలని అప్పుడే రైతుల పెట్టుబడి ఖర్చులు తగ్గి అధిక పంటల దిగుబడి పెరిగి అధిక ఆదాయం పొందే అవకాశం ఉందని మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్ గౌడ్ అన్నారు. చిలప్ చేడ్ మండలంలోని అజ్జమరి గ్రామంలో సోమవారం నాడు రైతులకు నానో యూరియా వాడకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నానో యూరియా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేయబడినటువంటి ప్రత్యేక రకమైన ద్రవరూపమైన ఎరువు ద్వారా మొక్కల పత్రాల రంధ్రాల ద్వారా పోషకాలు నేరుగా మొక్కలోకి వెళ్లడం ద్వారా పంటలు దిగుబడిపై గణనీయమైన సానుకూల ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్ గౌడ్‌తో పాటుగా రైతులు బాల్ రాజు, యాదయ్య, మల్లేశం,కృష్ణ, శ్రీనివాస్,ఇతర రైతులు పాల్గొన్నారు.



# కేంద్ర ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలి

**- స్థానిక ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం కృషి చేయాలి**

**- తుంగ కనకయ్య, బీజేపీ ఎన్నికల జిల్లా కన్వీనర్**

**నంగునూరు, ఆగస్టు 4(జనం సాక్షి)**
కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి రాబోయే పంచాయతీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ ఎన్నికల సిద్ధిపేట జిల్లా కన్వీనర్ తుంగ కనుకయ్య పిలుపునిచ్చారు. సోమవారం బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో నంగునూరులో స్థానిక సంస్థల ఎన్నికల మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమం కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా ఎన్నికల కన్వీనర్ తుంగ కనకయ్య మాట్లాడుతూ బీజేపీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల గురించి వివరించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను వివరించి స్థానిక ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించే విధంగా కార్యకర్తలు కృషి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు వెంకట్రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పప్పు సురేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు రజనీకర్ రెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు పరకాల తిరుపతి రెడ్డి, బూత్ కమిటీ అధ్యక్షులు వి.యాదగిరి, జె. రజనీకర్ రెడ్డి, సతీష్ గౌడ్, వంశీకృష్ణ, గంధం పరమేశ్వర రెడ్డి, చిలుకల తిరుపతి రెడ్డి, నాయకులు భాస్కర్ గౌడ్, భూపాల్ రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఎల్ఓసి అందజేసిన ఎమ్మెల్యే జిఎంఆర్



**పటాన్చెరు ఆగస్టు 4(జనం సాక్షి) :** నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి వరప్రదాయనిగా నిలుస్తోందని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఇస్నాపూర్ మున్సి పల్ పరిధిలోని చిట్కుల్ గ్రామానికి చెందిన కుమ్మరి బస్వరాజు గత కొంతకాలంగా అనా రోగ్యంతో చికిత్స పొందుతున్నారు. మెరుగైన వైద్య చికిత్స కోసం ప్రభుత్వం మంజూరు చేసిన రెండు లక్షల 50 వేల రూపాయల ఎల్ఓసిని సోమవారం ఎమ్మెల్యే జిఎంఆర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, వెంకట్ రెడ్డి, దశరథ రెడ్డి, పాండు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ చొరవతో రోడ్డు పనులు పునఃప్రారంభం : అశోక్



**శివ్వంపేట ఆగస్ట్ 4 జనంసాక్షి:**
మండల పరిధిలోని చండి, రెడ్యా తాండ, భోజ్యా తాండ, గోమారం, లచ్చిరెడ్డిగూడెం, నవాబ్ పేట్ గ్రామాలకు కేంద్ర ప్రభుత్వం సెంట్రల్ రోడ్ ఫండ్ ద్వారా నిధులను విడుదల చేయడం జరిగిందని బిజెపి నాయకులు అశోక్ సాదుల తెలిపారు. ఈ రోడ్డు మొదటి దశలో ఉసిరికపల్లి, భీమ్లా తాండ, శంకర్ తాండ, పాంబండ, పోతులబోగూడ వరకు పూర్తయిందని, రెండవ దశలో చండి, రెడ్యా తాండ, భోజ్యా తాండ, గోమారం, లచ్చిరెడ్డిగూడెం, నవాబ్ పేట్ గ్రామాలకు రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమైన ఆర్ అండ్ బి డీఈఈ, ఇతర అధికారుల నిర్లక్ష్యం వల్ల మధ్యలోనే నిలిచిపోవడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. ఈ విషయం పై బీజేపీ మండల సీనియర్ నాయకులు అశోక్ సాదుల పదిహేను రోజుల కింద మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు ను కలిసి ఆగిపోయిన రోడ్డు పరిస్థితి గురించి వివరించారు. దినికి స్పందించిన ఎంపీ రోడ్డు సంబంధిత అధికారులకు ఫోన్ చేసి వీలైనంత త్వరగా రోడ్డు విస్తరణ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. దీంతో రోడ్డు విస్తరణ పనులు పున:ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సాధుల అశోక్ మాట్లాడుతూ గత పదిహేను సంవత్సరాలు కాంగ్రెస్ ప్రభుత్వంలో నర్సాపూర్ నియోజకవర్గానికి రెండుసార్లు ఎమ్మెల్యేగా, ఒక పర్యాయం మంత్రిగా ప్రాతినిత్యం వహించిన సునితా లక్ష్మారెడ్డి తన స్వగ్రామానికి రోడ్డు తీసుకురాలేని ఘనత ఆమెకు దక్కిందని ఎద్దేవా చేశారు. శివ్వంపేట మండలంలో రోడ్ల గురించి అలాగే ఇతర సమస్యల గురించైనా ప్రజల పక్షాన కొట్లాడే పార్టీ భారతీయ జనతా పార్టీ అని అశోక్ చెప్పుకొచ్చారు.

# అంగన్వాడీ కేంద్రంలో పాడైన గుడ్లు

**చేర్యాల ఆగస్టు 04 (జనంసాక్షి) :**
చేర్యాల మండలంలోని చుంచనకోట గ్రామంలో ఓ అంగన్వాడి కేంద్రంలో పాడైపోయిన గుడ్లు దర్శనమిచ్చాయి. గ్రామానికి చెందిన అంగన్వాడి విద్యార్థి తల్లి పొట్టి మానస గత నేల 25న 3వ అంగన్వాడి కేంద్రం నుండి పిల్లల పౌష్టికాహారం కోసం తీసుకొచ్చారు. సోమవారం గుడ్లు ఉడకబెట్టి వడ్డించడానికి తీసి చూడగా పాడైనట్లు గుర్తించారు. వెంటనే సంబంధిత అంగన్ వాడి టీచర్ బాల నర్సవ్వను ఇదేమిటని ప్రశ్నించగా రెండు రోజుల వ్యవధిలోనే వండుకోవాలని చెప్పినట్లు పేర్కొన్నారు.



## ఛలో ఢిల్లీకి బయలుదేరిన కాంగ్రెస్ నాయకులు

**చేర్యాల ఆగష్టు 04 (జనంసాక్షి) :**



బీసీ రిజర్వేషన్ లను కేంద్రం అమలు చేయాలని జనగామ డీసీసీ అధ్యక్షులు, నియోజకవర్గ ఇంచార్జి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి నాయకత్వంలో సోమవారం జనగామ జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అందె నాని బాబు, చేర్యాల పట్టణ ప్రధాన కార్యదర్శి చింతల మల్లేశం ఛలో ఢిల్లీ జంతర్ మంతర్ దగ్గర జరిగే ధర్నాలో పాల్గొనడానికి బయలుదేరారు. వారికి చేర్యాల మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మంజ మల్లేశం పూర్తి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మంజ మల్లేష్ మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి బీసీల గురించి మొదటిసారిగా దేశ రాజధాని ఢిల్లీలో ధర్నా చేయడం శుభసూచకమన్నారు. కాంగ్రెస్ పార్టీ నుండి యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు భారీగా తరలి రావాలని పిలుపునిచ్చారు.

## బీసీ రిజర్వేషన్ల కోసం పోరాటం

**- ఢిల్లీకి యూత్ కాంగ్రెస్ నాయకులు**



**నంగునూరు, ఆగస్టు 4 (జనం సాక్షి)**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా ప్రతిపాదించిన 42 శాతం బీసీ రిజర్వేషన్ అమలుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వాలనే డిమాండ్‌తో, ఎన్ఎస్ యూఐ, యువజన కాంగ్రెస్ నాయకులు ఢిల్లీ బయలుదేరారు. సిద్దిపేట జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సాదుల పవన్ కుమార్, ఎన్ఎస్ యూఐ పట్టణ అధ్యక్షుడు సాదుల సాయి ప్రతాప్, ఎన్ఎస్‌యూఐ, అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి రాకేష్ యాదవ్, ఎన్ఎస్‌యూఐ, జిల్లా ఉపాధ్యక్షుడు అజ్మత్ అలీ, కర్రె మధు, నాయకం సాయి కుమార్ ఢిల్లీకి పయనమయ్యారు. ఈ బృందం ఢిల్లీలో ముఖ్య నాయకులను కలవనున్నారు. బీసీ హక్కుల సాధనలో భాగంగా తమ డిమాండ్లను మానవహక్కుల కమిషన్, ఇతర సంబంధిత కేంద్ర సంస్థల దృష్టికి తీసుకెళ్లనున్నారు. బీసీ వర్గాలకు న్యాయం జరగాలని, రాజకీయాల్లో తగిన ప్రాతినిధ్యం లభించాలని వారు కోరుతున్నారు. ఈ దిశగా కేంద్రం వెంటనే నిర్ణయం తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నోటుపుస్తకాలు పంపిణీ

**తూప్రాన్ ఆగస్టు 4 (జనం సాక్షి):**

హార్ట్ టు హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం నాడు తూప్రాన్ మండల పరిధిలో ఉన్న బాలుర - బాలిక ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ 32 మంది విద్యార్థినీ విద్యార్థులకు నోటుపుస్త కాలను పంపిణీ చేసినట్లు ట్రస్ట్ అధ్యక్షులు మూడే రవి నాయక్ తెలిపారు. గత సంవత్సరం నుంచి ఈ రెండు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు నోటుపుస్త కాలతో, వార్షిక పరీక్ష ఫీజు చెల్లింపు, పరీక్ష సామాగ్రినీ దాతల సహకారంతో పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు యోహాన్, సరోజిని, జయ, ఉమాదేవి, శైలజ, మంజు, విద్యార్థులు పాల్గొన్నారు.





# కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్రం

- పనిగంటలు పెంచి కేంద్ర ప్రభుత్వానికి వత్తాసు పలుకుతున్న రాష్ట్ర ప్రభుత్వం
- డిసెంబర్ 7-9 తేదీల్లో మెదక్ పట్టణంలో సీఐటీయూ రాష్ట్ర 5వ మహాసభలు
- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్. వీరయ్య



**తూప్రాన్ ఆగస్టు 4(జనం సాక్షి):**

కార్మికుల హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్. వీరయ్య అన్నారు. సోమవారం నాడు తుప్రాన్ పట్టణంలోని శివ శివాని ఫంక్షన్ హాల్ లో సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర 5వ మహా సభలను పురస్కరించుకొని సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర 5వ మహాసభల ఆహ్వాన సంఘం ఆధ్వర్యంలో లేబర్ కొడ్స్- కార్మికుల పై ప్రభావం అనే అంశంపై సెమినార్ సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఏ మహేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగింది.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్నా బీజేపీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కొడ్స్ తీసుకువచ్చిం దని స్వీటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరయ్య అన్నారు. 2014లో దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత నయా ఉదారవదా ఆర్థిక విధానాలను వేగంగా అమలు చేస్తుందని అన్నారు పెట్టుబడి దారులు, కాంట్రాక్టర్స్ లాభాల కోసం కార్మికులను బానిసలుగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని అన్నారు. దేశన్ని పరిపాలిస్తున్న పాలకులు కార్మికుల హక్కులపై దాడి చేస్తూనే ఉన్నారని అన్నారు.

ఫిక్స్ టార్మ్ ఎంప్లాయిమెంట్‌ను చట్ట బద్ధం చేసి ఉద్యోగుల భద్రతకు ముప్పు తెచ్చిందని అన్నారు. కార్మికులు ఐక్యం కాకుండా, సంఘం ఏర్పాటు చేసు కోకుండా, దోపిడీకి వ్యతిరేకం గా పోరాడకుండా యాజమాన్యల దయదక్షిణ్ణయాలపై కార్మికులు ఆధారపడాలని కేంద్ర ప్రభుత్వం కోరుకుంటుం దని అన్నరు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కొడ్స్ వలన 74 శాతం మందికి ఉద్యోగ భద్రత రద్దు అవుతుందని అన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న సమ్మె హక్కు లేకుండ చేయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని అన్నారు.

పని గంటలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జూలై 5నాడు జీవో విడుదల చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. సీఐటీయూ మెదక్ జిల్లా కార్యదర్శి ఏ మల్లేశం మాట్లాడుతూ మెదక్ జిల్లాలో మొదటి సారిగా సీఐటీయూ రాష్ట్ర 5వ మహాసభలు నిర్వహిస్తున్నామని అన్నారు. మహాసభల నిర్వహణ లో జిల్లాలోని కార్మిక వర్గం భాగ స్వామ్యం కావాలని అన్నారు. మహాసభలకు 33 జిల్లాల నుండి ప్రతినిధులు హాజరు అవుతున్నారని అన్నారు. మహాసభల సందర్భంగా కార్మికులు, ఉద్యోగుల సమస్యలపై జిల్లా వ్యాప్తంగా విస్తృతం గా సెమినార్స్ నిర్వహిస్తుమని అన్నారు. మహా సభల నిర్వహణ కోసం కార్మికులు, ఉద్యోగులు సహాయ సహకారాలు అందించాలని అన్నారు

ఈ కార్యక్రమంలో ఆహ్వాన సంఘం వైస్ చైర్మన్ అడివయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఏ మహేందర్ రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి గౌరయ్య, కావేరి యూనియన్ కార్యదర్శి బాలయ్య, ఇండస్ మెడికర్ యూనియన్ కార్యదర్శి బాలేష్, తిరుపతి, అంగన్వాడీ యూనియన్ నాయకులు ఇందిరా, ఆశా యూనియన్ నాయ కులు రేణుక, గ్రామ పంచాయతీ యూనియన్ నాయకులు శ్రీకాంత్, పోచయ్య, ఆర్‌పి యూనియన్ నాయకులు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచలంకు పాదయాత్ర

**బిజెపి రాష్ట్ర నాయకుడు వేణుమాధవ్**



**సదాశివపేట ఆగస్ట్ 4(జనం సాక్షి)**

హిందూ ధర్మంపై జరుగుతున్న అసాంఘిక శక్తుల దాడులను నిరసిస్తూ, హైందవ సాంస్కృతి, సాంప్రదాయాలను కాపాడాలని, లోక కళ్యాణమును కాంక్షిస్తూ సదాశివపేట పట్టణానికి చెందిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నెమలికొండ వేణుమాధవ్ భద్రాచలం సీతారామ చంద్రుల పుణ్యక్షేత్రం వరకు పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్ర సోమవారం సదాశివపేట పట్టణంలోని కృష్ణానగర్ కాలనీలో గల పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం నుండి వేద బ్రాహ్మణుల ప్రత్యేక పూజలు, ఆశీర్వచనములతో ప్రారంభించారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర నాయకులు కొవ్వూరు సంగమేశ్వర్ మాట్లాడుతూ రాష్ట్రంలో హిందూ దేవాలయాలపై ఇటీవల దాడులు జరుగుతున్నాయన్నారు. సమాజంలో అలజడిని సృష్టించే అసాంఘిక శక్తుల మూలాలపై ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వర రావు దేశ్పాండే, కొవ్వూరు సంగమేశ్వర్, ఓదెల మాణిక్ రావు, సర్వోత్తమ శర్మ, వెంకటరమణ ఆచార్య, కొత్త రమేష్, సగ్గం రాములు, పల్లె నాగేష్ యాదవ్, ఆంజనేయులు యాదవ్, కుమ్మరి రాజు, బెస్త రాము ,కుమ్మరి రాజు, శ్రీధర్, కంబాలపల్లి ఆంజనేయులు, ఆత్మకూరు రాజు, విజయ్, మాజీ కౌన్సిలర్ గుండు రవి, ఆదిత్యాకులకర్ణి, బిజెపి పట్టణ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు పవన్ గౌడ్, సుధాకర్ రెడ్డి, విష్ణు,ద్వారక రవి,తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ

**సదాశివపేట ఆగస్ట్ 4(జనం సాక్షి)**



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంది రమ్మ ఇండ్ల పథకంలో మంజూరైన లబ్ధిదారులతో కలిసి నిర్మాణ పనులను కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. సోమవారం పట్టణంలోని 18 వ వార్డులో ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారుల ఇంటి నిర్మాణ పనులను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు మునిపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ సకాలంలో ఇల్లు పూర్తి చేసుకుని ప్రభుత్వం అందిస్తున్న రూ 5 లక్షల ఆర్థిక సాయం పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ నాయకులు బిట్ల ప్రేమ్ కుమార్, సాబీర్, వసీం, సెజ్జి,లతీఫ్, కళావతి,మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం



**మొగుడాంపల్లి, ఆగష్టు 4 (జనం సాక్షి):**

తల్లిపాలు బిడ్డ మంచి ఆరోగ్యానికి దోహద పడతాయని ఐసీడీసీ సూపర్వైజర్ సద్గుణ అన్నారు. తల్లి పాల వారోత్సవాల కార్యక్రమం లో సోమవారం మొగుడంపల్లి మండలంలో అంగన్వాడి టీచర్ ఎస్.తుల్జమ్మ ఆధ్యక్షతన అంగన్వాడి సెంటర్లో నిర్వహించిన కార్యక్ర మంలో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడారు. శిశువు పుట్టిన దగ్గర నుంచి రెండేళ్ల వయస్సు వచ్చే వరకు తల్లిపాలు పట్టించాలన్నారు. తల్లిపాలు బిడ్డ మానసిక, శారీరకంగా ఎదుగు లకు ఉపయోగపడతాయన్నారు. చాలా మంది తల్లులు పిల్లలకు తేనె, నీళ్లు వంటివి పడుతుం టారని, అలా చేయడం వల్ల బిడ్డ అనారోగ్యా నికి గురవుతారన్నారు. రెండేళ్ల నుంచి బిడ్డకు అనుబంధ పోషకాహారాన్ని అందించాలని సూపర్వైజర్ సద్గుణ పేర్కొన్నారు. అనంతరం అంగన్‌వాడీ సెంటర్ పరిధిలోని గర్భిణులకు సీమంతాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం స్వరూప,ప్రవీణ, అంగన్వాడి టీచర్ తుల్జమ్మ, ఆశ వర్కర్లు యశోద, ప్రకృత,ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుండి 5 రోజులు ప్రత్యేక శానిటేషన్

## కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ జిల్లా బ్యూరో, ఆగస్టు 4 (జనం సాక్షి):** నేటి నుండి ఐదు రోజులపాటు జిల్లాలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల ద్వారా డ్రై డే పటిష్టంగా అమలు కావాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజా వాణి అనంతరం కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టరేట్ కార్యాలయ అధికారులు సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధి నిర్వహణలో జవాబుదారీతనంతో వ్యవహరిస్తూ ప్రజలకు పారదర్శక సేవలు అందించాలని, అన్ని శాఖల అధికారులు సిబ్బంది మూమెంట్ రిజిస్టర్ తప్పనిసరిగా మెయింటైన్ చేయాలని, సిబ్బంది సమయపాలనపై పటిష్ట నిఘా ఉంచాలన్నారు. సమయపాలనగా విధులు నిర్వహించని వారిపై క్రమశిక్షణ చర్యలు తప్పు అన్నారు, జిల్లాలో డెంగ్యూ మలేరియా దరిదా పులకు చేరకుండా ఐదు రోజులపాటు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి డ్రై డే సమర్థవ ంతంగా అమలు పరిచి ఇందులో భాగంగా ఇంటి ంటికి పంచాయతీ సెక్రెటరీ, ఆశ, ఏఎన్ఎం, హెల్త్ డిపార్ట్మెంట్ సమన్వయంతో నీరు నిల్వ ఉండకుండా చూడటం, ఆదిలోనే సీజనల్ జ్వరాలను గుర్తించి నివారణకు చర్యలు తీసుకోవాలని, దోమల లార్వాలను నిర్మూలించి సీజనల్ వ్యాధుల నుండి ప్రజలను రక్షించేందుకు వైద్య ఆరోగ్య శాఖ యంత్రాంగం చర్యలు చేపట్టా లన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూల్స్ ను మండల ప్రత్యేక అధికారులు సందర్శించి మధ్యాహ్న భోజన పథకం అమలు, పాఠశాల నిర్వహణ తీరును ప్రత్యక్ష పర్యవేక్షణ ద్వారా తెలుసుకొని నివేదికలు అందజేయాల న్నారు. విద్యా విభాగం ద్వారా అన్ని ప్రభుత్వ సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతలో భాగంగా భోజనానికి ముందు సబ్బుతో చేతులు కడుక్కోవడం పిల్లలకు అలవాటుగా మారాలని ఆ దిశగా విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. తద్వారా టైఫాయిడ్ జ్వరాల బారిన పడకుండా పిల్లలను రక్షించవచ్చు అన్నారు. ముఖ్య అతిథుల సమావేశాలు నిర్వహించినప్పుడు ఆయా శాఖల సమగ్ర సమాచారం సిద్ధంగా ఉండాలన్నారు. కలెక్టరేట్ కార్యాలయ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వ్యక్తిగతంగా ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించినట్లయితే రోడ్డు ప్రమాదాల బారి నుండి రక్షించుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్ , డిఆర్డిఓ శ్రీనివాసరావు, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, కలెక్టరేట్ ఏవో యూనస్, సంబంధిత ఇతర జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



### ప్రజా సమస్యలకు త్వరగా పరిష్కారం : జిల్లా కలెక్టర్

ప్రజావాణి కార్యాక్రమం ద్వారా ప్రజా సమస్యలను త్వరగా పరిష్కారం చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. కలెక్టర్ కార్యాల యంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 111 మంది తమ సమ స్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకున్నార న్నారు. భూ సమస్యలు -32, పింఛన్లు -10, ఇందిరమ్మ ఇండ్లు-12, ఇతర సమస్యలు -57 గా ఉన్నాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారుల ను కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిఆర్డిఓ శ్రీనివాసరావు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



### తల్లిపాలతో ప్రయోజనాలు అనేకం

- అంగన్వాడి మండల పర్యవేక్షకురాలు అనిత

**న్యాల్ కల్, ఆగస్టు 04, (జనం సాక్షి) :** తల్లిపాలు ఓ అమృతం లాంటివని, ముర్రుపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని, పుట్టిన బిడ్డకు కనీసం ఆరు నెలల పాటు తల్లిపాలనే అందించాలని, ఎట్టి పరిస్థితుల్లో పోషకాలు లేని డబ్బా పాలను అందించరాదని మండల (న్యాల్ కల్, హద్నూనూర్ సెక్టర్) అంగన్వాడి పర్యవేక్షకురాలు అనిత సూచించారు. సోమవారం న్యాల్ కల్ లోని ఏవన్ (1) అంగన్వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బాలింతలు, గర్భిణీలకు తల్లిపాల విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పర్యవేక్షకురాలు మారుతా, అంగన్వాడి కార్యకర్త పద్మ, తదితరులు పాల్గొన్నారు.

### పంట మార్పిడితోనే మెరుగైన దిగుబడి



**న్యాల్ కల్, ఆగస్టు 4, (జనం సాక్షి) :** ప్రతి ఏటా ఒకే రకమైన పంటలను సాగు చేయడం, అధిక మోతాదులో ఎరువులు, మందులను వాడడంతో భూసారం తగ్గి పంట దిగుబడి అధిక మొత్తంలో తగ్గనుందని, ప్రతి ఏటా పంట మార్పిడితోనే మెరుగైన దిగుబడి సాధించవచ్చని మండలంలోని వ్యవసాయ విస్తీర్ణ (చాల్కి) అధికారి సాయి కిరణ్ రెడ్డి రైతులకు సూచించారు. సోమవారం మండలంలోని అమీరాబాద్ గ్రామంలో.."నాణ్యమైన విత్తన పథకం" ద్వారా సాగులో ఉన్న పెసర పంటను పరిశీలించారు. వ్యవసాయ అధికారులు పంపిణీ చేసిన నాణ్యమైన విత్తనంతో సాగు చేసిన పెసర పంట ఎంతో ఆశాజనకంగా ఉందని రైతులు శ్రీనివాస్ రెడ్డి, తుకారాం తదితరులు సంతోషం వ్యక్తం చేశారు. గ్రామంలో 'నాణ్యమైన విత్తన పథకం" ద్వారా సాగు చేసిన వివిధ పంటలను పరిశీలించి సంబంధిత రైతులకు చాల్కి సెక్టార్ వ్యవసాయ విస్తీర్ణ అధికారి సాయి కిరణ్ రెడ్డి పలు సూచనలు ఇచ్చారు.

# 19 సంవత్సరాలుగా భక్తుల పాదయాత్ర

## ఘన స్వాగతం పలికిన మాజీ ఎంపీ బీబీ పాటిల్




**న్యాల్ కల్, ఆగస్టు 04, (జనం సాక్షి) :** మహారాష్ట్రలోని హాళేగావ్, కర్ణాటకలోని నిట్టూర్ ప్రాంతాలకు చెందిన వందలాది భక్తులు పాదయాత్రగా తరలివచ్చారు. సంగారెడ్డి జిల్లా, ఝరా సంఘం శ్రీ ఖేతకి సంగమేశ్వరుని దర్శించుకునేందుకు గత 19 సంవత్స రాలుగా పవిత్ర శ్రావణమాసంలో దాదాపు 140 కిలో మీటర్ల మేర పాదయాత్రగా తరలివచ్చి శ్రీ సంగమేశ్వరుని దర్శించుకుంటారు. మహారాష్ట్ర, హణేగావ్ లకు చెందిన బాలాజీ పాటిల్, రవి పాటిల్, మున్నా, బాబు పాటేల్, సంజీవ్ పాటిల్ ల ఆధ్వర్యంలో భక్తుల పాదయాత్ర కొనసాగింది.

**ఘన స్వాగతం పలికిన మాజీ ఎంపీ, అత్నూర్ గ్రామ భక్తులు**

ఈ నెల 1న ప్రారంభమైన భక్తుల పాదయాత్ర ఆదివారం బీదర్ మీదుగా న్యాల్ కల్ మండలం, అత్నూర్ గ్రామానికి వందల సంఖ్యలో భక్తులు చేరుకున్నారు. గ్రామంలోని ఏక్ నాథ్ పాటిల్ వ్యవసాయ క్షేత్రంలో ప్రత్యేకంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామానికి చెందిన పలువురు భక్తులు పాదయాత్రగా తరలివచ్చిన భక్తులకు సంయుక్తంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆదివారం సాయంత్రం న్యాల్ కల్, ముంగి గ్రామాల మీదుగా సిద్దాపూర్ గ్రామంలోని శ్రీ సిద్ధి లింగేశ్వర ఆలయానికి చేరుకున్నారు. వందల సంఖ్యలో ఆలయానికి చేరుకున్న భక్తులకు భాజపా నేత, జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్ ఘన స్వాగతం పలికారు. భక్తులతో కలిసి కొంతమేరకు పాదయాత్ర నిర్వహించారు. స్థానిక భాజపా నేతలు గంగువార్ మల్లేష్, బసవరాజ్ పాటిల్, శ్రీనివాస్ రెడ్డి, ఏక్ నాథ్ పాటిల్, లోకేష్ పాటిల్, తదితరులు మాజీ ఎంపీ, భక్తులకు ఘన స్వాగతం పలికారు.

### వర్గల్ నవోదయ దరఖాస్తు గడువు పెంపు

**న్యాల్ కల్, ఆగస్టు 04, (జనం సాక్షి) :** ఉమ్మడి మెదక్ జిల్లా, వర్గల్ లోని జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రవేశం పొందేందుకు దరఖాస్తు గడువును పొడిగించినట్లు మండల విద్యాధికారి మారుతి రాథోడ్ తెలిపారు. 2026 - 2027 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతిలో ప్రవేశం పొందేందుకు జిల్లా విద్య ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు దరఖాస్తుల స్వీకరణ గడువు ఈ నెల ఆగస్టు 13 వరకు పొడగించినట్లు విద్యాధికారి తెలిపారు. ప్రభుత్వ, గుర్తింపు పొందిన పాఠశాలలకు చెందిన ఆసక్తి కలిగి, అర్హులైన ఐదవ తరగతి విద్యార్థులు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.



### పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలి

- ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



**సదాశివపేట ఆగస్ట్ 4 (జనం సాక్షి)** పార్టీ మారిన పదిమంది ఎమ్మెల్యేలపై వెంటనే అనర్హత వెటు వేయాలని అసెంబ్లీలోని గాంధీ విగ్రహం ముందు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిర్వహించిన ధర్నాలో సంగారెడ్డి జిల్లా ఎమ్మెల్యే లు చింత ప్రభాకర్,మాణిక్ రావులు పాల్గొన్నారు. సోమవారం నాడు అసెంబ్లీలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అందుబాటులో లేకపోవడంతో గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ పార్టీ మారిన ఎమ్మెల్యేలపై మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పిందన్నారు. వెంటనే పార్టీ మారిన ఎమ్మెల్యేలపై స్పీకర్ అనర్హతవేయాలని తెలిపారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

### మృతదేహం లభ్యం



**చిన్నశంకరంపేట ఆగస్టు 04(జనం సాక్షి)** మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండల కేంద్రంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించింది. సోమవారం ఉదయం స్థానిక జీకే వైన్ సమీపంలో మగ వ్యక్తి మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ నారాయణ గౌడ్ ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతుడు ఎవరు, అనేది తెలియాల్సి ఉంది. అయితే గత కొన్ని రోజులుగా రోడ్డుపై తిరుగుతున్న మతిస్థిమితం లేని వ్యక్తిగా అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్నట్లు నారాయణ గౌడ్ తెలిపారు.

## స్మశానంలో సమాధులపై నుండి శివలింగాల దొంగలు

**చిన్నశంకరంపేట, ఆగస్టు 04 (జనం సాక్షి)**



స్మశానంలో సమాధులపై శివలింగాలు దొంగిలించిన విచిత్ర సంఘటన చిన్నశంకరంపేట మండల పరిధి అంబాజీపేట లోచోటుచేసుకుంది. అంబాజీపేట గ్రామంలో ధ్యాప మానెమ్మ రాములు గత ఆరు సంవత్సరాల క్రితం చనిపోయారు. వారి నలుగురు కుమారులు రెండు సమాధులు నిర్మించారు వాటిపై శివలింగాలను ఏర్పాటు చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు రంపాలతో రెండు శివలింగాలను కోసుకొని ఎత్తుకెళ్లారు. కుటుంబ సభ్యులు రాజు మాట్లాడుతూ స్మశానం లో కూడా సమాధులపై శివలింగాలు దొంగతనం చేయడం ఏమిటని కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు

## సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి

**- ప్రజావాణి కి 57 ఫిర్యాదులు - డిఆర్‌ఓ పద్మజ రాణి**



**సంగారెడ్డి,ఆగస్టు 4( జనం సాక్షి) :** ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రజావాణి నిర్వహించినట్లు డిఆర్ఓ పద్మజారాణి తెలిపారు. సోమవారము ,జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 57 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను డిఆర్ఓ పద్మజ రాణి, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి, జడ్పీ సీఈఓ జానకి రెడ్డి, పిడిడి ఆర్‌డిఓ జ్యోతిలకు విన్నవిస్తూ వివిధ సమస్యలకు సంబ ంధించి ఫిర్యాదులు సమర్పించారు. ప్రజా ఫిర్యాదులను సంబంధిత అధికారు లు పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటిక ప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఫిర్యాదు దారులకు సమాచారం తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సెక్షన్ సూపరింటెండెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

## కుళ్లిపోయిన కూరగాయలతో వండమంటున్నారు

**- ప్రజావాణిలో వంట మనిషి ఫిర్యాదు - తహసిల్దార్ బృందం పాఠశాల తనిఖీ**

**ఝరాసంగం, ఆగస్టు 4 (జనం సాక్షి):** కుళ్లిపోయిన కూరగాయలతో విద్యార్థులకు ప్రిన్సిపల్ వంటలు వండమంటున్నారని పాఠశాల వంట మనిషి వెంకటేశం సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అలా కుళ్లిపోయిన కూరగాయలతో తాను వంట వండనని, విద్యార్థులకు ఏదైనా జరగరానిది జరిగితే ఎవరు బాధ్యులని అన్నందుకు పాఠశాల ప్రిన్సిపల్ తనను దుర్భాషలాడిందన్నారు. స్థానిక తహసిల్దార్ కార్యాల యంలో నిర్వహించే ప్రజావాణి అధికారులకు ఫిర్యాదు చేశానన్నారు. ఫిర్యాదు అందుకున్న స్థానిక తహసిల్దార్ తిరుమలరావు, డిప్యూటీ తహసిల్దార్, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు మహాత్మ జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలోని వంటగది, అందులోని సామగ్రిని పరిశీలించారు.అంతేకాకుండా మధ్యాహ్నం వండిన భోజనాన్ని విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.వండిన వంట అందుకు సంబంధించిన కూరగాయలు తాజాగానే ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినందుకు సంబంధిత వంట మనుషులను విధులకు రానీయకుండా ప్రిన్సిపల్ వెళ్లగొట్టారని ఫిర్యాదుదారుడు వెంకటేశం తెలిపారు.



# సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : ఏఎస్ఐ

**కృష్ణ, ఆగస్టు 4 (జనం సాక్షి) :**



ప్రజలు సైబర్ నేరాలు,దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఐ సురేందర్ బాబు అన్నారు. కృష్ణ రైల్వే స్టేషన్లో సురేందర్ బాబు ఆధ్వర్యంలో సోమవారం ప్రజలకు, ప్రయాణికులకు సైబర్ నేరాలు, ట్రైన్లో ప్రయాణించే టప్పుడు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అలాగే వాహనాలు నడిపే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సైబర్ నేరాలు, రోడ్డు భద్రత నియమాలు తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎస్ఐ సురేందర్ బాబు మాట్లాడుతూ ప్రజలు సైబర్ నేరగాళ్లు చూపే మోస పూరిత ఆశలకు గురికారాదని లాటరీ తగిలిందని, తక్కువడ్డీకి లోన్ ఇస్తామని, గిఫ్ట్ ప్యాక్‌లు వచ్చాయి అని, తక్కువ రేట్‌కి వాహనాలు దొరుకుతాయని, ఎవరైనాపై అధికారి వాట్సాప్ డీపీ పెట్టుకుని వాట్సాప్‌లో మెసేజ్ చేసి డబ్బులు పంపమని అడిగితే పంపరాదనీ సూచించారు.మొబైల్ ఫోన్లో బ్లూ లింక్స్ ఓపెన్ చేయరాదని, ఎవరైనా ఓటీపీలు అడిగితే చెప్పరాదని మొదలగు మోసపూరిత ఆశలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అనుకోకుండా సైబర్ నేరానికి గురైతే 1930 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అలాగే ట్రైన్లో ప్రయాణం చేసేటప్పుడు ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, లగేజ్ బ్యాగులు విలువైన వస్తువులు, డబ్బులు, కిటికీల దగ్గరకు కూర్చున్నప్పుడు బంగారు గొలుసులు జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు.



## ప్రజావాణిలో వంట మనిషి ఫిర్యాదు

**- తహసిల్దార్ బృందం పాఠశాల తనిఖీ**

**ఝరాసంగం, ఆగస్టు 4(జనం సాక్షి)**

కుళ్లిపోయిన కూరగాయలతో విద్యార్థులకు ప్రిన్సిపల్ వంటలు వండమంటున్నారని పాఠశాల వంట మనిషి వెంకటేశం సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అలా కుళ్లిపోయిన కూరగాయలతో తాను వంట వండనని, విద్యార్థులకు ఏదైనా జరగరానిది జరిగితే ఎవరు బాధ్యులని అన్నందుకు పాఠశాల ప్రిన్సిపల్ తనను దుర్భాషలాడిందన్నారు.స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి అధికారులకు ఫిర్యాదు చేశానన్నారు. ఫిర్యాదు అందుకున్న స్థానిక తహసిల్దార్ తిరుమలరావు, డిప్యూటీ తహసిల్దార్, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు మహాత్మ జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలోని వంటగది, అందులోని సామగ్రిని పరిశీలించారు.అంతేకాకుండా మధ్యాహ్నం వండిన భోజనాన్ని విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.వండిన వంట అందుకు సంబంధించిన కూరగాయలు తాజాగానే ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు.అధికారులకు ఫిర్యాదు చేసినందుకు సంబంధిత వంట మనుషులను విధులకు రానీయకుండా ప్రిన్సిపల్ వెళ్లగొట్టారని ఫిర్యాదుదారుడు వెంకటేశం తెలిపారు.



## పేకాట రాయుల అరెస్టు

**చిన్నశంకరంపేట ఆగస్టు 04(జనం సాక్షి) :** నమ్మదగిన సమాచారం మేరకు నలుగురు పేకాట రాయులను పట్టుకొని అరెస్టు చేసినట్లు ఎస్సై నారాయణ గౌడ్ తెలిపారు. సోమవారం చిన్నశంకరంపేట మండలం గవ్వల పల్లి ఎక్స్ రోడ్ రైతు వేదిక వెనకాల పేకాట ఆడుతున్నారన్న నమ్మదగిన సమాచారం మేరకు రైడ్ చేయగా, నలుగురిని ఆగస్టు చేసినట్లు తెలిపారు.వీరి నుండి ఇన్నోవా కారు, రెండు మోటార్ సైకిళ్లు, ఐదు మొబైల్ ఫోన్లు, కొంత నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

# ఎంపీ సహకారంతో సోలార్ లైటింగ్ ఏర్పాటు

**జనం సాక్షి/ కొల్చారం :** కొల్చారం గ్రామంలో కూరగాయల మార్కెట్ వద్ద మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు సహకారంతో సోలార్ సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు చింతల యాదగిరి, కొల్చారం గ్రామ బిజెపి బూత్ అధ్యక్షుడు తమ్మలి సంతోష్ కుమార్, మండల ఉపాధ్యక్షుడు రాజు గారి కృష్ణ, మైనార్టీ మోర్చా ఎండి ఖలీల్, మాజీ సర్పంచ్ ఉమా రాజా గౌడ్, గ్రామ కారోబార్ వడ్ల ప్రభాకర్, ముదిరాజ్ సంఘం ప్రెసిడెంట్ ఆశన్న గారి అంజయ్య, సంటయ్య, మోల్ సాబ్, చింతల కిష్టయ్య, చింతల రాములు, ఎండుగుల దుర్గయ్య, పిట్ల అరవింద్, మ్యాదరి యాదగిరి, చౌరీ గారి సంతోష్, గ్రామస్తులు పెద్దలు పాల్గొన్నారు.



# ఆవులు రాజిరెడ్డి సహకారంతో సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

**జనం సాక్షి/ కొల్చారం**



60000 సీఎంఆర్ఎఫ్ చెక్కును అందించిన కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగులగారి మల్లేశం గౌడ్ నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజి రెడ్డి సహకారంతో కొల్చారం మండలం వరిగుంతం కుడి చెరువు తాండకు చెందిన రామావత్ సంతోష్ మరణించిన సందర్భంలో వారికి దావకానకైనా ఖర్చులు నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 60 వేల రూపాయల చెక్కును నేడు కొల్చారం మండల కేంద్రంలో వారి భార్య అయిన రేణుకకు అందించడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ముత్యం గారి గోవర్ధన్ మండల ట్రెజరర్ చందాపురం మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





### యోగ గురువు శివానంద స్వామి ధ్యాన–విజ్ఞాన

# యోగ శిక్షణకు విశేష స్పందన

- యోగా చేద్దాం ఆరోగ్యంగా ఆనందంగా జీవిస్తూ భావితరాలకు ఆరోగ్యాన్ని పంచుదాం
- యోగా గురువు శివానంద స్వామి

**నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో, ఆగస్టు 4 (జనంసాక్షి):** గత 12 సంవత్సరాలుగా రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో వేల మందికి శిక్షణ ఇచ్చి సంపూర్ణ ఆరోగ్యాన్ని అందిస్తున్న యోగాలో నిష్ణాతులైన యోగా గురువు శివానంద స్వామి ఆధ్వర్యంలో నాగర్కర్నూల్ జిల్లా కేంద్రంలో గత నెల రోజులుగా నిర్వహిస్తున్న ధ్యాన- విజ్ఞాన-యోగ శిక్షణకు విశేష స్పందన లభించింది.జిల్లా కేంద్రంలోని మున్నూరు ఫంక్షన్ హాల్ లో 500 మందితో మూడు బ్యాచులు పూర్తిచేసుకుని జులై 27న తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్న నాలుగవ బ్యాచ్ యోగ శిక్షణ శిబిరానికి ఉదయం సాయంత్రం సమయాలలో 250 మంది యోగ శిక్షణను పొందుతున్నారు.ఈ శిక్షణలో పురుషులతో పాటుగా మహిళలు కూడా ఎక్కువ సంఖ్యలో పాల్గొనడం విశేషం.ఈ యోగ శిక్షణలో శివానంద స్వామి గురూజీ వ్యాయామాలు, ఆసనాలు, సూర్య నమస్కారాలు, మరియు రాజయోగ ప్రాణయామాలతో పాటు ధ్యానం చేయడం కూడా నేర్పిస్తున్నారు. అభ్యాసకులకు శిక్షణ కాలం పది రోజులలో ప్రతిరోజు వివిధ రకాల కూరగాయలు పండ్లతో అమృత హారాన్ని అందిస్తున్నారు. ఆదివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నాలుగు బ్యాచ్ లకు చెందిన యోగ అభ్యాసకులు అధిక సంఖ్యలో పాల్గొని ఒక్కరోజు పూర్తి ఉపవాసం



ఉంటూ వివిధ ఆటలు, నృత్యాలు చేస్తూ ఆహ్లాదంగా గడిపారు.యోగా గురువు శివానంద స్వామి మాట్లాడుతూ యోగ అభ్యసనం చేయడంతో శరీరాన్ని ఎంతో ఆరోగ్యంగా ఉంచడంతో పాటు మానసిక ఒత్తిడిని తగ్గిస్తాయని అన్నారు. యోగ ప్రక్రియలు జీవన శైలిని మెరుగుపరచడంలో సహాయపడుతుందన్నారు. యోగ, ధ్యానం చేయడం వల్ల బిపి, షుగర్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతూ సోమరితనం, బద్ధకం, నిద్రమత్తు, నిద్రలేమి, అధిక బరువు, శారీరక నొప్పులు, మలబద్ధకం, కడుపు నొప్పి, కోపం, చిరాకు, ఘర్షణ, ఆందోళన, అతి ప్రవర్తన, అహంకారం వంటి సమస్యలను దూరం చేసుకుంటూ మానసిక ప్రశాంతతను పొందవచ్చని కావునా యోగా చేద్దాం ఆరోగ్యంగా ఆనందంగా జీవిద్దాం, భావితరాలకు ఆరోగ్యాన్ని పంచుదామని పిలుపునిచ్చారు. ఈ శిక్షణ శిబిరంలో పాల్గొన్న పలువురు అభ్యాసకులు తమకు లభించిన అనుభవాలను పంచుకుంటూ తమలో ఉన్న అనేక రుగ్మతలు తొలిగాయని, మానసిక ప్రశాంతతను పొందామని హర్షం వ్యక్తం చేశారు.నాగర్ కర్నూల్ లో శాశ్వత యోగా శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా శివానంద స్వామి గురూజిని కోరారు. అందుకు శివానంద స్వామి స్పందిస్తూ నాగర్ కర్నూల్ ప్రజలు సహకరిస్తే త్వరలోనే నాగర్ కర్నూల్ లో శాశ్వత యోగ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసుకుందామని తెలిపారు.







## కొట్ర గ్రామంలో శ్రీ చెన్నకేశవ స్వామి విగ్రహ ప్రతిష్టాపన

**- ముఖ్యఅతిథిగా పాల్గొన్న కల్వకుర్తి మాజీ శాసనసభ్యులు గుర్క జయపాల్ యాదవ్**

**వెల్దండ ఆగస్టు 04 (జనంసాక్షి) :** వెల్దండ మండలంలోని కోట్ర గ్రామంలో శ్రీ చెన్నకేశవ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి కల్వకుర్తి మాజీ శాసనసభ్యులు జైపాల్ యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ చెన్నకేశవ స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆలయ కమిటీ నిర్వాహకులు ఘనంగా శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో దేవాలయ విగ్రహ ప్రతిష్టలు చేయాలి అందరూ దైవ మార్గంలో ఉండాలి శ్రీ చెన్నకేశవ స్వామి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా గ్రామంలో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని పాడిపంటలతో సంతోషంగా ఉండాలని సందర్భంగా అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు మాజీ ఎంపీటీసీ రాములు,బిఆర్ఎస్ పార్టీ యూత్ వింగ్ మండల అధ్యక్షులు జంగిలి యాదగిరి,యువ నాయకులు ఆనంద్,గణేష్, అల్లాజి, శ్రీను, అశోక్, భాస్కర్,మల్లయ్య, జంగయ్య, లక్ష్మయ్య, వెంకటయ్య, కృష్ణయ్య, గణేష్ మరియు గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొబైల్ హెల్త్ క్లినిక్ ప్రారంభం

**వెల్దండ ఆగస్టు 04 (జనంసాక్షి) :** నూతనంగా ఏర్పాటు చేసిన మొబైల్ హెల్త్ క్లినిక్ బస్సును టాస్క్ సీఈఓ సుంకి రెడ్డి రాఘవేందర్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఐక్యత ఫౌండేషన్ -వన్ మెడి హబ్ సంయుక్తంగా నిర్వహించే మెగా మొబైల్ హెల్త్ క్యాంప్ విజయవంతం చేయాలని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఈఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. సోమవారం వెల్దండ మండల కేంద్రంలోని ఐక్యత ఫౌండేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కల్వకుర్తి నియోజకవర్గం లోని అన్ని మండలాల పరిధిలోని గ్రామాలలో సుంకిరెడ్డి - మొబైల్ హెల్త్ క్యాంప్ సేవలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. అదే విధంగా ఫౌండేషన్ ద్వారా విద్య - వైద్యం - ఉపాధి రంగాలలో ప్రతి కుటుంబానికి అండగా ఉండాలనే ధృడ సంకల్పంతో ముందుకు వెళ్తున్నామని,మా సంకల్పం ప్రతి గ్రామానికి,ప్రతి కుటుంబానికి ప్రాథమిక వైద్యసేవలు ఉచితంగా అందు బాటులో ఉంచి, ప్రజలందర్నీ ఆరోగ్యవంతులుగా తయారు చేయడమే ఫౌండేషన్ లక్ష్యమని అన్నారు. ప్రతి మారుమూల గ్రామంలో కూడా ఆరోగ్యం పై అవగాహన కల్పించి,వారిని చైతన్య పరచడం,సుంకిరెడ్డి మొబైల్ హెల్త్ క్యాంప్ ద్వారా ముఖ్యంగా ఆధునాతన టెక్నాలజీతో రూపొందించిన వన్ మెడి హబ్ మొబైల్ యూనిట్ ద్వారా ఒక గంటలో 150 పైగా పరీక్షలు నిర్వహించే సామర్థ్యంతో డిజైన్ చేయడం జరిగిందని, లివర్ కి సంబంధించి బిల్రుబిన్,కిడ్నీలకు సంబంధించి క్రియాటిన్,గుండెకు సంబంధించి కొలెస్ట్రాల్, కాల్షియం, యూరియా, షుగర్ మొదలగు టెస్ట్ లను ఉచితంగా మారుమూల గ్రామాల ప్రజలకు అందించి,వారికి అవగాహన కల్పించడం ముఖ్య లక్ష్యమని తెలియజేశారు. మా మొదటి క్యాంప్ ఆమనగల్ మండలం మేడిగడ్డ తండాలో ఈనెల 6వ తారీఖు బుధవారం రోజున ప్రారంభించబోతున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వన్ మెడి హబ్ ఫౌండర్ సంతోష్ కుమార్, ఫౌండేషన్ సభ్యులు రమేష్ నాయక్, శివకుమార్, గణేష్,రమేష్ యాదవ్, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





# మళ్లీ జోరు అందుకున్న ప్రైవేట్ స్కూళ్ల బస్సులు, పట్టించుకోని అధికారులు

**-డ్రైవర్ మత్తుమందు సేవించి డ్రైవింగ్ - అప్రమత్తమైన గ్రామస్తులు**

**గద్వాల నడిగడ్డ,ఆగస్టు 4 (జనం సాక్షి)**

జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని నోబెల్ స్కూల్ చెందిన ప్రైవేట్ బస్సు డ్రైవర్ అజాగ్రత్తగా నడుపుతుండంతో గోనుపాడు గ్రామస్తులు, వాహనదారులు స్కూల్ బస్సును నిలిపివేశారు. డ్రైవర్ మధ్యం మత్తులో ఉన్నట్లుగా అనుమానం రావడంతో స్కూల్ యాజమాన్యానికి సమాచారం అందించారు. బస్సులో దాదాపు 70 నుండి 80 మంది పిల్లలు ఉన్నారనీ, గ్రహించిన గ్రామస్తులు ప్రవేట్ స్కూల్ యాజమాన్యం కు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో స్పందించిన యజమాన్యం హుటా హుటిన బస్సు దగ్గరికి చేరుకొని మత్తు మందు సేవించిన డ్రైవర్ ని పక్కకు పెట్టి వేరే డ్రైవర్ తో ఆ బస్సును పంపించినట్లు గ్రామస్తులు తెలిపారు. గోనుపాడు గ్రామస్తులు అలర్ట్ అయ్యి మత్తు సేవించిన డ్రైవర్ ను గమనించకపోతే పిల్లల ప్రాణాలు గాలిలో కలిసేవని వారన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్య తీసుకొని మత్తు సేవించి డ్రైవింగ్ చేసే వారిపై తగు చర్యలు తీసుకొని పిల్లల ప్రాణాలను కాపాడాలని, గతంలో కూడా ఐజ పట్టణంలో మత్తు పానీయాలు సేవించి ఇలానే డ్రైవింగ్ చేశారని ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు అన్నారు.

## సీఎం సహాయనిధి పేదలకు వరం : మాజీ సర్పంచ్ రామకృష్ణ



**వెల్దండ ఆగస్టు 04 (జనం సాక్షి) :** అనారోగ్యంతో బారిన పడిన పేదలకు సిఎంఆర్ఎఫ్ వరంగా నిలుస్తుందని, నిరుపేద ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కంటోనిపల్లి మాజీ సర్పంచ్ రామకృష్ణ తెలిపారు. వెల్దండ మండల కంటోనిపల్లి గ్రామానికి చెందిన కంఠం అంజమ్మ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాదులోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా ఎమ్మెల్యే కాశిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో సీఎం సహాయ నిధి నుండి మంజూరైన 21,500 వేల రూపాయలు చెక్కును సోమవారం కంటోనిపల్లి మాజీ సర్పంచ్ రామకృష్ణ బాధితురాలికి కంటోనిపల్లి గ్రామంలోని అందజేశారు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో దేశంలో ఎక్కడ లేని విధంగా పేద, మధ్య తరగతి కుటుంబాల ఆరోగ్య రక్షణ కోసం సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో తోడ్పడుతుందని అన్నారు. కంటోనిపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి ఫయాజ్,మాజీ ఉప సర్పంచ్ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## నాగర్ దొడ్డి గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు ప్రారంభం

**మల్దకల్ ఆగస్టు 4(జనంసాక్షి)**

జోగులాంబ గద్వాల్ జిల్లా మల్దకల్ మండల పరిధిలోని నాగర్ దొడ్డి గ్రామంలో సోమవారం అంగన్వాడి కేంద్రంలోతల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. సూపర్వైజర్ వాసంతి మాట్లాడు తూ ముర్రుపాలు పట్టించటం వలన వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని,తల్లి పాలు బిడ్డకు ఎంత అవసరమని, గర్భిణీలకు పౌష్టికాహారం అందించాలన్నారు. గర్భవతిగా ఉన్నప్పుడు తీసు కోవలసిన సమతుల్య ఆహారంపై అవగాహన కల్పించటం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ వనజాక్షి, డాక్టర్ సౌజన్య, ఏఎన్ఎం అరుణాదేవి, ఆశ వర్కర్స్, సిఆర్పి సువర్ణ, తల్లులు పాల్గొన్నారు.



# ముదిరాజ్ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలికి ఘన సన్మానం



**జడ్చర్ల, ఆగస్టు 4 (జనంసాక్షి):** తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలుగా ఎన్నికైన జడ్చర్ల మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ దోరేపల్లి లక్ష్మి రవీందర్‌ను సోమవారం మాజీ మంత్రి, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ సి. లక్ష్మారెడ్డి సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ముదిరాజ్ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షరాలుగా ఎన్నికైన లక్ష్మి ముదిరాజ్ కులస్తుల అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు లత, నవనీత, ప్రశాంత్ రెడ్డి, నందకిషోర్ గౌడ్, ఉమా శంకర్ గౌడ్, నాయకులు పిట్టల మురళి, నర్సింలు, కృష్ణారెడ్డి, శ్రీకాంత్, పరమటయ్య, వీరేష్, పెద్దగుట్ట శ్రీ రంగనాయక స్వామి దేవాలయ పరిరక్షణ కమిటీ అధ్యక్షులు కాల్వ రామిరెడ్డి దంపతులు తదితరులు పాల్గొన్నారు.

# మెగా ఇంజనీరింగ్ కంపెనీపై ఫిర్యాదు

**- త్వరలో హెచ్చార్సీలో ఫిర్యాదు - మాజీ జెడ్పిటిసి కాశపోగు రాజు**

**మానవపాడు, ఆగస్టు 4 (జనం సాక్షి )**



మెగా ఇంజనీరింగ్ కంపెనీ పై తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలిలో ఫిర్యాదు చేసినట్లు వడ్డేపల్లి మాజీ జెడ్పిటిసి కాశపోగు రాజు సోమవారం పేర్కొన్నారు. సోమవారం హైదరాబాదులో టీజీ పిసిబి ఇంజనీర్ సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. వడ్డేపల్లి మండలం తనగల, కేటు దొడ్డి మండలం కుచినెర్ల, గట్టు మండలం రాయపురం వద్ద అక్రమంగా క్లస్టర్లు ఏర్పాటు చేసుకొని కంకర గ్రావెల్ తరలిస్తున్నారని వివరించారు. కంపెనీపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి మండలానికి చెందిన కాశపోగు రాజు మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా అక్రమ క్రషర్ మిషన్లు పెట్టి కోట్ల రూపాయల స్టోన్ కంకర దోపిడీ చేస్తున్న మెగా ఇంజనీరింగ్ కంపెనీ అని తెలిపారు. అక్రమంగా క్రషర్లు పెట్టి ప్రభుత్వంకు చలానలు కట్టకుండా ఇప్పటికీ గ్రావెల్ కంకర దోచేస్తున్నారు అని జోగులాంబ గద్వాల జిల్లా మైనింగ్ అధికారులు పట్టించుకోవడం లేదు అని తెలిపారు. 50 కోట్ల రూపాయల పెనాల్టీ కట్టకుండా పిటిటి మాఫీ అయిందని, ఇంకా కంకర గ్రావెల్ దోపిడీ చేస్తున్నారని వాటిని అరికట్టి మెగా ఇంజనీరింగ్ కంపెనీపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో షేక్ మతిన్ తదితరులు ఉన్నారు.




# నిందితునికి ఆరు సంవత్సరాల జైలు శిక్ష : స్థానిక ఎస్సై కె రాణి

**వీపనగండ్ల, ఆగస్టు 5 (జనం సాక్షి)**

వీపనగండ్ల మండల కేంద్రానికి చెందిన దయ్యాపు శివ తండ్రి దయ్యాపు రామకృష్ణ కు వనపర్తి జిల్లా న్యాయస్థానం ఆరు సంవత్సరాల జైలు శిక్ష, 2000 రూపాయల ఫైన్ ఖరారు చేశారు. స్థానిక ఎస్సై కే రాణి వివరాల ప్రకారం దయ్యాపు శివ అనే వ్యక్తికి భార్యను వేధించి మరణానికి కారణమైన కేసులో జిల్లా న్యాయస్థానం జడ్జి సునీత శిక్ష ఖరారు చేసినట్లు కే రాణి, న్యాయస్థానం కానిస్టేబుల్ రాజేందర్ తెలిపారు.

# స్నేహితుని కుటుంబానికి అండగా నిలిచిన చిన్ననాటి స్నేహితులు

**వెల్దండ్ ఆగస్టు 04 (జనంసాక్షి) :**



వెల్దండ మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ ఆసిఫ్ గత కొన్ని రోజుల కింద అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందడం జరిగింది. విషయం తెలుసుకున్న తనతో పాటు చదువుకున్న చిన్ననాటి స్నేహితుల దినోత్సవ సందర్భంగా తన కుటుంబానికి ఎస్ఎస్సి స్నేహితులు తమ వంతు సహాయంగా 32000 రూపాయలను ఆర్థికంగా అందజేయడం జరిగింది. అతనికి ఇద్దరు చిన్న పిల్లలు కూడా ఉన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు కూడా ఉన్నాయి.వారి పవిత్రమైన ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించి ఇలాగే వారి మిత్రులకు ఎవ్వరికి ఆపద లో ఉన్న మేము ఉన్నాం అని ఒక ధైర్యాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమ ంలో పాల్గొన్నా వారు మల్లేష్ యాదవ్,కొండల్ యాదవ్, సిహెచ్ మహేందర్,మట్ట చంద్రకాంత్, కానుగుల సాయిబాబు,పిల్లి శ్రీను, కొండల్ ముదిరాజ్, ఆనంద్, వెంకటేష్, సద్దాం,జంగిలి కొండల్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీలక్ష్మి చెన్నకేశవ విగ్ర ధ్వజస్తంభ ప్రతిష్టాపన



**వెల్దండ ఆగస్టు 04 (జనంసాక్షి) :**

ప్రతి ఒక్కరూ భక్తి భావంతో పాటు ఆధ్యాత్మిక చింతనతో జీవించాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని కొట్ర గ్రామంలో నూత నంగా శ్రీలక్ష్మి చెన్నకేశవ స్వామి దేవాల యంలో విగ్ర ప్రతిష్ట, ధ్వజస్వంబ ప్రతిష్ట కార్యక్రమానికి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సంజీవ్ కుమార్ యాదవ్, మట్ట వెంకటయ్య గౌడ్, రవీందర్రావు, గోలి సురేందర్ రెడ్డి,కడారి శ్రీనివాస్ యాదవ్, షాంపూరి లక్ష్మయ్య, వెంకటయ్య, ఉడుత వెంకటయ్య యాదవ్, దస్తగిరి, వసంతపు రాజు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.